

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 01-07-2025 | సంపుటి - 24 | సంచిక - 58 | రూ : 4 | పేజీలు: 8


## బంకర్ బస్టర్ క్షిపణులపై భారత్ దృష్టి

# శత్రువుల భూగర్భ స్థావరాలే లక్ష్యం!

### బంకర్ బస్టర్ క్షిపణుల తయారీని వేగవంతం చేసిన భారత్

- అగ్ని-5 క్షిపణికి కొత్త రూపాన్ని ఇస్తున్న డీఆర్‌డీఓ
- భూగర్భంలో 100 మీటర్ల లోతు వరకు చొచ్చుకెళ్లే సామర్థ్యం
- శత్రు దేశాల భూగర్భ కమాండ్ సెంటర్లు, సైనిక స్థావరాలే లక్ష్యం
- విమానాలపై ఆధారపడకుండా, తక్కువ ఖర్చుతో రూపకల్పన



ప్రపంచం యుద్ధ సమీకరణాలు మారుతున్న నేపథ్యంలో, భారతదేశం తన రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. ఇటీవలి అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా, భూగర్భంలోని శత్రు లక్ష్యాలను

తరువాయి 2లో



## ఫ్యాక్టరీ పేలుడులో ఎనిమిది మంది మృతి.. శిథిలాల కింద మరికొంతమంది కార్మికులు!

- ఫ్యాక్టరీలో చెల్లాచెదురుగా పడిపోయిన కార్మికులు
- పేలుడు ధాటికి కుప్పకూలిన రియాక్టర్ షెడ్

పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన పేలుడులో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. పేలుడు ధాటికి వంద మీటర్ల దూరం ఎగిరిపడ్డ కార్మికుల్లో ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో ముగ్గురు కార్మికులు చనిపోయారని అధికార వర్గాలు తెలిపాయి. పేలుడు తీవ్రతకు

తరువాయి 2లో



2లో

## ఒకే ఒక్క స్కాన్‌తో 9 రకాల డిమెన్షియాలకు చెక్..

- అమెరికా పరిశోధకుల అద్భుత ఆవిష్కరణ!
- డిమెన్షియా గుర్తింపులో సరికొత్త ఏఐ టూల్ ఆవిష్కరణ
- 'స్టేట్‌వ్యూయర్' పేరుతో అమెరికా మేయో క్లినిక్ పరిశోధకుల ఘనత

## రైలు ప్రయాణికులకు గమనిక

# అర్ధరాత్రి నుంచే కొత్త ఛార్జీల బాదుడు!

### అర్ధరాత్రి నుంచి పెరగనున్న రైల్వే ప్రయాణ ఛార్జీలు

- తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు ఆధార్ కార్డు ఇకపై తప్పనిసరి
- వివిధ తరగతుల్లో కిలోమీటరుకు పైసా నుంచి 2 పైసల వరకు పెంపు
- రిజర్వేషన్ ఛార్జీలు, సూపర్‌ఫాస్ట్ సర్‌ఛార్జీల్లో మాత్రం ఎలాంటి మార్పు లేదు
- ఇప్పటికే బుక్ చేసుకున్న టికెట్లకు పాత ధరలే వర్తిస్తాయని స్పష్టీకరణ

దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులపై ఛార్జీల భారం పడనుంది. పెంచిన రైల్వే ఛార్జీలతో పాటు టికెట్ బుకింగ్‌లో కీలక నిబంధనలను సోమవారం అర్ధరాత్రి నుంచి అమలు చేస్తున్నట్లు రైల్వే బోర్డు ప్రకటించింది. ఈ మేరకు అన్ని జోన్ల మేనేజర్లకు ఆదేశాలతో కూడిన సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం జులై 1వ తేదీ నుంచి కొత్త ఛార్జీలు, నిబంధనలు అమల్లోకి రానున్నాయి.

**ఏ క్లాస్‌కు ఎంత పెరిగిందంటే?**

రైల్వే శాఖ తాజా నిర్ణయంతో వివిధ తరగతుల్లో టికెట్ ధరలు పెరగనున్నాయి. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్‌ఏసీ ప్రయాణానికి

తరువాయి 2లో








## అమరావతిలో క్వాంటమ్ పార్క్..

# ఏపీని టెక్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న సీఎం

### విజయవాడలో క్వాంటమ్ వ్యాలీపై జాతీయ స్థాయి వర్క్‌షాప్

- అమరావతిలో క్వాంటమ్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం ప్రకటన
- ప్రభుత్వంతో చేతులు కలపనున్న టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ
- భవిష్యత్ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని చంద్రబాబు పిలుపు
- అధునాతన టెక్ కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దుతామన్న సీఎం

అమెరికాలోని సిలికాన్ వ్యాలీకి దీటుగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 'క్వాంటం వ్యాలీ'ని ఏర్పాటు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. దీనిని 2026 జనవరి 1 నాటికి ప్రారంభించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి ప్రఖ్యాత సంస్థల భాగస్వామ్యంతో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందని తెలిపారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన 'అమరావతి క్వాంటం వ్యాలీ' జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఐటీ, ఫార్మా, వాణిజ్య, నిర్మాణ రంగాలకు చెందిన ప్రముఖ బహుళజాతి సంస్థల ప్రతినిధులతో పాటు కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ టెక్నాలజీకి కేంద్రంగా మార్చాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

**హైటెక్ సిటీ స్ఫూర్తితో ముందుకు**

ఈ సందర్భంగా తాను గతంలో ముఖ్యమంత్రిగా

తరువాయి 2లో

## రైలు ప్రయాణికులకు గమనిక
# అర్ధరాత్రి నుంచే కొత్త ఛార్జీల బాదుడు!

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి సెకండ్ క్లాస్, స్లీపర్ క్లాస్, ఫస్ట్‌క్లాస్ టికెట్లపై కిలోమీటరుకు ఒక పైసా చొప్పున పెంచారు. అదేవిధంగా, అన్ని రకాల రైళ్లలోని ఏసీ తరగతుల్లో (ఏసీ చైర్ కార్, ఏసీ 3టైర్, 2టైర్, ఫస్ట్ క్లాస్) ప్రయాణానికి కిలోమీటరుకు రెండు పైసల చొప్పున ఛార్జీని పెంచుతున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. ఆర్డినరీ రైళ్లలోని స్లీపర్, ఫస్ట్ క్లాస్ టికెట్లపై కిలోమీటరుకు అర పైసా చొప్పున ధర పెరగనుంది. అయితే, ఆర్డినరీ సెకండ్ క్లాస్‌లో ప్రయాణించే వారికి పాక్షిక ఉపశమనం కల్పించారు. 500 కిలోమీటర్ల వరకు పాత ఛార్జీలనే కొనసాగించనున్నారు. 501 నుంచి 1,500 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తే టికెట్‌పై రూ. 5, 2001 నుంచి 2500 కిలోమీటర్లకు రూ. 10, 2501 నుంచి 3000 కిలోమీటర్ల వరకు రూ. 15 అదనంగా వసూలు చేయనున్నారు.

**తత్కాల్ బుకింగ్‌కు ఆధార్ తప్పనిసరి**

ఛార్జీల పెంపుతో పాటు తత్కాల్ టికెట్ల బుకింగ్ విధానంలో రైల్వే శాఖ కీలక మార్పు చేసింది. జులై 1 నుంచి తత్కాల్ కోటాలో టికెట్లు బుక్ చేసుకోవాలంటే ఆధార్ కార్డును తప్పనిసరి చేసింది. ఈ నిబంధనను పక్కాగా అమలు చేయాలని అధికారులకు సూచించింది. అయితే, రిజర్వేషన్ ఛార్జీలు, సూపర్‌ఫాస్ట్ సర్‌ఛార్జీలలో ఎటువంటి మార్పులు చేయలేదని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. ఇప్పటికే రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు పాత ఛార్జీలే వర్తిస్తాయని, పెరిగిన ధరలు వారికి వర్తించవని తేల్చిచెప్పింది.

## ఒకే ఒక్క స్కాన్‌తో
# 9 రకాల డిమెన్షియాలకు చెక్..

వైద్య రంగంలో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. అల్జీమర్స్ వంటి మతిమరుపు వ్యాధులను (డిమెన్షియా) అత్యంత కచ్చితత్వంతో, వేగంగా గుర్తించేందుకు అమెరికా పరిశోధకులు ఒక కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్‌ను అభివృద్ధి చేశారు. 'స్టేట్‌వ్యూయర్' అని పిలిచే ఈ టూల్, కేవలం ఒకే ఒక్క స్కాన్ సహాయంతో ఏకంగా తొమ్మిది రకాల డిమెన్షియాలను గుర్తించగలదు. ఇది మెదడు పనితీరును దెబ్బతీసే వ్యాధుల (న్యూరోడిజనరేటివ్) నిర్ధారణలో ఒక విప్లవాత్మక ముందడుగుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

**88 శాతం కచ్చితత్వంతో నిర్ధారణ**

అమెరికాలోని ప్రఖ్యాత మేయో క్లినిక్‌కు చెందిన పరిశోధకులు ఈ ఏఐ టూల్‌ను రూపొందించారు. ఈ టూల్ పనితీరు అమోఘమని, సుమారు 88 శాతం కేసులలో ఏ రకమైన డెమెన్షియానో కచ్చితంగా చెప్పగలిగిందని వారు తెలిపారు. అంతేకాకుండా, ప్రస్తుతం వైద్యులు అనుసరిస్తున్న పద్ధతులతో పోలిస్తే, ఈ టూల్ సహాయంతో మెదడు స్కానింగ్‌లను రెట్టింపు వేగంతో విశ్లేషించవచ్చని, రోగ నిర్ధారణలో కచ్చితత్వం మూడు రెట్లు పెరిగిందని వెల్లడించారు. ఈ పరిశోధన వివరాలను ప్రఖ్యాత 'న్యూరాలజీ' జర్నల్‌లో ప్రచురించారు.

**'స్టేట్‌వ్యూయర్' పనిచేసే విధానం**

సాధారణంగా అందుబాటులో ఉండే ఫ్లోరోడీఆక్సీగ్లూకోజ్ పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ (ఎఫ్‌డీజీపీఈటీ) స్కాన్‌ను ఈ ఏఐ టూల్ విశ్లేషిస్తుంది. ఈ స్కాన్ ద్వారా మెదడు శక్తి కోసం గ్లూకోజ్‌ను ఎలా వినియోగించుకుంటుందో తెలుసుకోవచ్చు. 'స్టేట్‌వ్యూయర్', రోగి స్కాన్‌ను దాదాపు 3,600కు పైగా ధ్రువీకరించబడిన స్కాన్‌ల డేటాబేస్‌తో పోల్చి చూస్తుంది. ఈ డేటాబేస్‌లో వివిధ రకాల డెమెన్షియా రోగుల స్కాన్‌లతో పాటు, ఆరోగ్యవంతుల స్కాన్‌లు కూడా ఉంటాయి. తద్వారా, ఏ రకమైన డిమెన్షియాకు సంబంధించిన నమూనాలు రోగి మెదడులో ఉన్నాయో ఇది



గుర్తిస్తుంది. అల్జీమర్స్ వ్యాధి మెదడులోని జ్ఞాపకశక్తి, సమాచార ప్రాసెసింగ్ ప్రాంతాలపై ప్రభావం చూపుతుంది. లూయీ బాడీ డిమెన్షియా ఏకాగ్రత, కదలికలకు సంబంధించిన భాగాలను దెబ్బతీస్తుంది. ఈ తేడాలను ఏఐ కచ్చితంగా పసిగడుతుంది. విశ్లేషణ అనంతరం, కలర్‌కోడెడ్ బ్రెయిన్ మ్యాప్‌ల రూపంలో ఫలితాలను అందిస్తుంది. దీనివల్ల న్యూరాలజీలో ప్రత్యేక శిక్షణ లేని వైద్యులు కూడా ఏఐ అందించిన రోగ నిర్ధారణను సులభంగా అర్థం చేసుకోవచ్చు.

**వ్యాధి నిర్ధారణలో కొత్త ఆశలు**

ప్రస్తుతం డిమెన్షియాను గుర్తించాలంటే క్లిష్టమైన కాగ్నిటివ్ పరీక్షలు, రక్త పరీక్షలు, ఇమేజింగ్, రోగితో సుదీర్ఘ సంభాషణలు అవసరం. అయినప్పటికీ అల్జీమర్స్, లూయీ బాడీ డిమెన్షియా, ఫ్రంటోటెంపోరల్ డిమెన్షియా వంటి వ్యాధుల మధ్య తేడాను గుర్తించడం సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో 'స్టేట్‌వ్యూయర్' ఒక గొప్ప ముందడుగు అని మేయో క్లినిక్ న్యూరాలజిస్ట్, ఏఐ ప్రోగ్రామ్ డైరెక్టర్ డేవిడ్ జోన్స్ అన్నారు. "నా దగ్గరకు వచ్చే ప్రతి రోగిదీ ఒక ప్రత్యేకమైన కథ. ఈ టూల్ ద్వారా వ్యాధిని ముందుగానే అర్థం చేసుకుని, కచ్చితమైన చికిత్స అందించే దిశగా పయనిస్తున్నాం. భవిష్యత్తులో ఈ వ్యాధుల గమనాన్ని మార్చగలమనే నమ్మకం ఉంది" అని ఆయన వివరించారు. ప్రపంచవ్యాప్తంగా 5.5 కోట్ల మందికి పైగా డిమెన్షియాతో బాధపడుతుండగా ఏటా కోటి కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఇందులో అత్యంత సాధారణమైన అల్జీమర్స్, ప్రపంచవ్యాప్తంగా మరణాలకు ఐదో ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో 'స్టేట్‌వ్యూయర్' వంటి సాంకేతిక ఆవిష్కరణలు లక్షలాది మంది జీవితాల్లో కొత్త ఆశలు నింపుతున్నాయి.

## ఫ్యాక్టరీ పేలుడులో ఎనిమిది మంది మృతి..
# శిథిలాల కింద మరికొంతమంది కార్మికులు!

రియాక్టర్ ఉన్న షెడ్డు మొత్తం కూలిపోయిందని, ఫ్యాక్టరీలో మంటలు ఎగిసిపడుతున్నాయని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీలో పెద్ద సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారని వివరించారు. దీంతో శిథిలాల కింద మరికొంతమంది కార్మికులు చిక్కుకుని ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కార్మికుల్లో పలువురి ఫోన్లు పనిచేయకపోవడంతో వారి కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. ఇదిలా ఉండగా, పరిశ్రమ నుంచి వెలువడుతున్న ఘాటైన వాసనల కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిగాచీ కెమికల్ ఫ్యాక్టరీ లోపల పరిస్థితి భయానకంగా ఉందని, ఎక్కడ చూసినా కార్మికులు పడిపోయి కనిపించారని అధికారులు తెలిపారు. గాయపడిన వారిని చందానగర్, ఇస్నాపూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. 11 ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకు వచ్చేందుకు యత్నిస్తున్నారు. ఘటనాస్థలాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పరిశీలించారు.

## అమరావతిలో క్వాంటమ్ పార్క్..
# ఏపీని టెక్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న సీఎం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నప్పటి అనుభవాలను చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. "నేను తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు ఐటీ పరిశ్రమ ప్రాముఖ్యతను గుర్తించి మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌తో చర్చించాను. పీపీపీ పద్ధతిలో హైదరాబాద్‌లో హైటెక్ సిటీని నిర్మించాలని ఎల్ అండ్ టీని కోరాను. ఆ స్ఫూర్తితోనే ఇప్పుడు అమరావతిని అధునాతన సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం. భవిష్యత్తులో భారత్ అతిపెద్ద ఐటీ హబ్‌గా మారుతుందని నేను అప్పుడే చెప్పాను" అని వివరించారు.

* **పాలన, వ్యవసాయంలో క్వాంటం టెక్నాలజీ**

క్వాంటం కంప్యూటింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను ముఖ్యమంత్రి వివరిస్తూ, ఇది కేవలం ఒక కంప్యూటర్‌ను తీసుకురావడమే కాదని, దాని ద్వారా పూర్తిస్థాయి ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తామని అన్నారు. "వ్యవసాయంలో నేల తేమ, ఎరువుల వాడకం వంటి అంశాలను పర్యవేక్షించడానికి, ప్రభుత్వ సేవలను వేగంగా ప్రజలకు అందించడానికి క్వాంటం టెక్నాలజీ ఎంతో అవసరం. ఇప్పటికే ఏపీలో వాట్సప్ ద్వారా ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. ఆగస్టు 15 నాటికి వంద శాతం సేవలను వాట్సప్ ద్వారానే అందించేలా చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. సీసీ కెమెరాలు, సెన్సార్ల ద్వారా వచ్చే రియల్ టైమ్ డేటాను విశ్లేషించేందుకు ఈ టెక్నాలజీ కీలకం కానుందని చెప్పారు.

**స్టార్టప్‌లకు, పెట్టుబడులకు ఆహ్వానం**

క్వాంటం టెక్నాలజీ రంగంలో స్టార్టప్‌లకు అపార అవకాశాలు ఉన్నాయని, ఆవిష్కరణలకు ఆకాశమే హద్దని చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతి సహా ఐదు ప్రాంతాల్లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని, యువత వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బహుళజాతి కంపెనీలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. "పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడానికి టెక్నాలజీయే సరైన మార్గం. హైదరాబాద్‌లో నిర్మించిన హైటెక్ సిటీ వల్లే నేడు తెలంగాణ ఆదాయంలో 75 శాతం అక్కడి నుంచే వస్తోంది. అమరావతి క్వాంటం వ్యాలీ కూడా దేశానికే మార్గదర్శకంగా నిలవాలి" అని ఆకాంక్షించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును విజయవంతం చేసే బాధ్యతను ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు అప్పగించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అనంతరం మంత్రి లోకేశ్‌తో కలిసి వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన క్వాంటం టెక్నాలజీ స్టార్టప్‌ల స్టాళ్లను పరిశీలించారు.

## బంకర్ బస్టర్ క్షిపణులపై భారత్ దృష్టి
# శత్రువుల భూగర్భ స్థావరాలే లక్ష్యం!

(మొదటిపేజీ తరువాయి)

సైతం ఛేదించగల శక్తిమంతమైన బంకర్ బస్టర్ క్షిపణుల అభివృద్ధిని వేగవంతం చేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు దేశీయంగానే ఈ అధునాతన ఆయుధ వ్యవస్థను సిద్ధం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ బృహత్తర కార్యక్రమాన్ని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) చేపట్టినట్లు తెలుస్తోంది. దీని కోసం 5,000 కిలోమీటర్లకు పైగా పరిధి కలిగిన అగ్ని5 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణికి కొత్త రూపాన్ని ఇస్తున్నారు. ఈ నూతన వేరియంట్ ఏకంగా 7,500 కిలోల బరువైన బంకర్ బస్టర్ వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలదు. ఇది భూమిలోకి 80 నుంచి 100 మీటర్ల లోతు వరకు చొచ్చుకెళ్లి, ఆ తర్వాత పేలి భూగర్భంలోని లక్ష్యాలను పూర్తిగా ధ్వంసం చేయగలదని సంబంధిత వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇటీవల ఇరాన్‌లోని అణు కేంద్రాలపై అమెరికా ప్రయోగించిన భారీ బాంబుల తరహాలో, భారత్ కూడా స్వదేశీ పరిజ్ఞానంతో ఈ క్షిపణులను రూపొందిస్తోంది. అయితే, విమానాల ద్వారా జారవిడిచే బాంబులకు బదులుగా, నేరుగా క్షిపణి రూపంలోనే ప్రయోగించేలా వీటిని తీర్చిదిద్దుతున్నారు. దీనివల్ల విమానాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు, ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుంది. ప్రస్తుతం డీఆర్‌డీఓ రెండు రకాల అగ్ని5 నూతన వేరియంట్లను అభివృద్ధి చేస్తున్నట్లు సమాచారం. ఒకటి భూ ఉపరితల లక్ష్యాల కోసం కాగా, మరొకటి చైనా, పాకిస్థాన్ వంటి దేశాల్లోని భూగర్భ కమాండ్‌అండ్ కంట్రోల్ కేంద్రాలు, క్షిపణి స్థావరాలను ధ్వంసం చేసేందుకు ఉపయోగపడనుంది. హైపర్‌సోనిక్ వేగంతో ప్రయాణించే ఈ క్షిపణులు భారత రక్షణ వ్యవస్థకు మరింత పటిష్ఠతను చేకూర్చనున్నాయి.

# ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై నారా లోకేశ్ ప్రశంసలు

* **ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన ఉపాధ్యాయుడు వాసుదేవరావు**
* **ప్రజల్లో ఆలోచన రేకెత్తించారని లోకేశ్ ప్రశంస**
* **విద్యా వ్యవస్థలో సంస్కరణల ఫలితమని వ్యాఖ్య**

ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రశంసల వర్షం కురిపించారు. తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచిన ఆ ఉపాధ్యాయుడికి అభినందనలు తెలిపారు. ఇలాంటి సంఘటనలు చూసినప్పుడు విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం పడిన శ్రమను మరిచిపోవచ్చని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే, రాజాం నియోజకవర్గం డోలపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు డోల వాసుదేవరావు, తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ బడిలోనే చదివిస్తున్నారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి లోకేశ్ వాసుదేవరావు లాంటి వారిని చూసినప్పుడు తాను కోరుకున్న మార్పు ఇదేనని అనిపిస్తోందని అన్నారు. రాజకీయాలకు దూరంగా, సమగ్ర విద్యకు దగ్గరగా పాఠశాలలను తీర్చిదిద్దేందుకు పడిన కష్టానికి ఫలితం దక్కుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. "ప్రభుత్వ పాఠశాలల ముందు 'నో అడ్మిషన్' బోర్డులు చూడాలన్నదే నా ఆకాంక్ష. ఒక ఉపాధ్యాయుడే తన పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పిస్తున్నప్పుడు, ఇతరులు ఎందుకు చదివించకూడదు అనే ఆలోచన ప్రజల్లో రేకెత్తించిన వాసు మాస్టర్‌కు నా అభినందనలు" అని లోకేశ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలు, సమస్యల పరిష్కారానికి ఇది నిదర్శనమని ఆయన తెలిపారు. అంతేకాకుండా, "మన బడికి మనమే అంబాసిడర్స్‌గా నిలుద్దాం. అందరం కలిసి మన రాష్ట్రాన్ని దేశానికే దిక్సూచిగా నిలిచే 'ఏపీ మోడల్ ఎడ్యుకేషన్' కేంద్రంగా తీర్చిదిద్దుదాం" అని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుడి చర్య ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## మోదీని నిలదీసే ధైర్యం వారికెక్కడిది
# జగన్, చంద్రబాబులపై వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు

* **చంద్రబాబు, జగన్ ఇద్దరూ మోదీకి దాసోహమయ్యారన్న షర్మిల**
* **కాంగ్రెస్ లోకి రావాలంటూ నేతలు, యువతకు సూచన**
* **రాహుల్ ప్రధాని అయితే విభజన హామీలు అమలవుతాయని వ్యాఖ్య**



ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ ఇద్దరూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి దాసోహమయ్యారని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రాన్ని ప్రశ్నించే సత్తా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆమె స్పష్టం చేశారు. పార్టీ బలోపేతం కోసం ఈ జూన్ నెలలోనే 26 జిల్లాల్లో సుమారు 2,500 కిలోమీటర్లు పర్యటించానని తెలిపారు. రాష్ట్ర విభజన హామీలను బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కినా, రాష్ట్రానికి చెందిన ఏ ఒక్క నాయకుడు కూడా కేంద్రాన్ని నిలదీసే పరిస్థితిలో లేరని షర్మిల ఆరోపించారు. "కేంద్రంలో మోదీ అధికారంలో ఉండటానికి చంద్రబాబే కారణం. అయినా కూడా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆయన కేంద్రంపై కనీస ఒత్తిడి తీసుకురావడం లేదు. మరోవైపు, కేంద్రం మెడలు వంచుతామని చెప్పిన జగన్ చివరికి తన మెడనే మోదీ ముందు వంచారు" అని ఆమె ఎద్దేవా చేశారు. జగన్ ఇప్పటికీ మోదీని ఒక్క మాట అనకుండా, కేవలం చంద్రబాబును విమర్శిస్తూ దత్తపుత్రుడిలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41 మీటర్లకు కుదిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నా, రాష్ట్రం నుంచి ఒక్క ఎంపీ కూడా దానిపై మాట్లాడకపోవడం దారుణమని షర్మిల మండిపడ్డారు. రాజధాని అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా అప్పులు ఇవ్వడమేంటని ఆమె ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపుతామన్న హామీపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత లేదని గుర్తుచేశారు. విభజన హామీలు ఏవీ అమలు కాకపోయినా, చంద్రబాబు, పవన్ కల్యాణ్ మోదీకి మద్దతు పలకడం విచారకరమన్నారు. తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మొదటి నుంచి బీజేపీని వ్యతిరేకించారని, కానీ జగన్ మాత్రం మోదీకి గులాంగిరీ చేశారని విమర్శించారు. రాబోయే నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని షర్మిల ధీమా వ్యక్తం చేశారు. "రాజకీయాలపై ఆసక్తి ఉండి, భవిష్యత్తులో ఎమ్మెల్యేలు కావాలనుకునే వారు, రాష్ట్రానికి సేవ చేయాలనుకునే వారు కాంగ్రెస్‌లోకి రావాలి. అందరం కలిసి పనిచేద్దాం" అని ఆమె పిలుపునిచ్చారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే నాయకులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, వైఎస్ఆర్ వంటి నేతల త్యాగాలతో నిండిన కాంగ్రెస్ పార్టీతోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే రాష్ట్ర విభజన హామీలు పూర్తిగా అమలవుతాయని పేర్కొంటూ, సోనియా, రాహుల్ గాంధీ నాయకత్వంలో పార్టీ తిరిగి బలపడుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

# జూలై 3,4 తేదీల్లో నిర్వహించే 48 గంటల విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయాలి




ప్రజాస్ఫూర్తి, కాప్రా: పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిపు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ తెలంగాణ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో జూలై 3,4 తేదీల్లో నిర్వహించే నలబై ఎనిమిది గంటల విద్యా సంస్థల బంద్ జయప్రదం కోరుతూ జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ గ్రేటర్ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ.సీ.ఐ.ఎల్ లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జార్జిరెడ్డి పి. డి.ఎస్.యూ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ కె స్వాతి మాట్లాడుతూ తెలంగాణలో ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయని కారణంగా విద్యార్థులు, విద్యా భవిష్యత్ అంధకారంలోకి నెట్టివేయబడుతున్నదని అన్నారు. ఫండ్స్ రిలీజ్ చేయని కారణంగా ప్రభుత్వ విద్యా సంస్థలు సైతం విద్యార్థుల నుండి ముందస్తు ఫీజులు వసూలు చేసే స్థాయికి విద్యా వ్యవస్థ దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యా శాఖ కి మంత్రిగా ముఖ్యమంత్రి ఉన్నపటికీ సమస్యలకు నిలయంగా విద్యా రంగం మారిపోవడం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. ప్రభుత్వ అధినేత విద్యా శాఖ పట్ల చిత్తశుద్ధి తో పనిచేస్తే సమస్యలు ఎందుకు పునరావృతం అవుతాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో సుమారు ఎనిమిది వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ , స్కాలర్షిప్ బకాయిల నిధులు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. రాష్ట్ర మంత్రులు మాత్రం ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యా రంగ సమస్యల పరిష్కారానికి, పెండింగ్ లో ఉన్న నిధులు విడుదల కోరుతూ జులై 3,4 తేదీలలో జార్జి రెడ్డి పి.డి.ఎస్ యూ నిర్వహిస్తున్న నలబై ఎనిమిది గంటల విద్యా సంస్థల బంద్ లో విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. విద్యా రంగ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలని, లేని యెడల విద్యార్థి పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జార్జిరెడ్డి పీడీఎస్యు గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి రుక్మత్ పాషా, జిల్లా నాయకులు రాము, నాయకులు లిఖిత, ప్రణిత, కావ్య, అంజనీ, నవ్య, సుజిత, మౌనిక, అక్షర తదితరులు నాయకత్వం వహించారు.

## ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి పౌరుడి భాద్యత

*** కుషాయిగూడ ట్రాఫిక్ సి.ఐ ఎన్. రామ లక్ష్మణ రాజు**



ప్రజాస్ఫూర్తి , కాప్రా : ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి పౌరుడి భాధ్యత అని కుషాయిగూడ ట్రాఫిక్ సి.ఐ ఎన్. రామ లక్ష్మణ రాజు అన్నారు. సోమవారం హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనంపై ప్రయాణించడం ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే చర్య, దీనిని నివారించడానికి కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసు ఉన్నత అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన అవగాహన కార్యక్రమం లో భాగంగా హెల్మెట్ లేనివారిని పట్టుకొని వారి చేత హెల్మెట్ కొనిపించి మరి ధరింపచేశారు. ఈ సంధర్భంగా కుషాయిగూడ ట్రాఫిక్ సి.ఐ ఎన్. రామ లక్ష్మణ రాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఈ మధ్య కాలంలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తూ సంభవిస్తున్న మరణాల సంఖ్యను తగ్గించడమన్నారు. ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించండి - ప్రాణాలను కాపాడుకోండి అని పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రోత్సాహాలు



ప్రజా స్పూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మండలంలో గల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో విద్యార్థుల నమోదు తదితర ప్రభుత్వ విద్యా కార్యక్రమాల అమలులో ప్రత్యేక చొరవను చూపుతున్న ప్రభుత్వ పాఠశాలలను, విద్యార్థులను ప్రోత్సహించేలా నేడు ఆయా పాఠశాలలకు చిన్నారుల లైబ్రరీ పుస్తకాలు, రాత పుస్తకాలు, నూతన వస్త్రాలను కొత్తగూడెం ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్ నేడు బహుకరించారు. పాఠశాలల్లో విద్యార్థులే కీలకం కావున ప్రభుత్వం సూచించే ప్రతి విద్యా కార్యక్రమాన్ని విధిగా అమలు చేయాలన్నారు. నేటి బాలురే రేపటి పౌరులు కావున చక్కని విద్యా విలువలతో విద్యనందిస్తూ ఉత్తమ పౌరులను సమాజానికి అందించేలా కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి విఐపి కావున ప్రత్యేక శ్రద్ధ వారిపై చూపాలన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎం లు, ఎంఆర్సి సిబ్బంది పాల్గొన్నారు.

## చర్లపల్లి రైల్వే టెర్మినల్ లో ప్రయాణికుల సమస్యల పరిష్కారాన్ని కృషి

*** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా: చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్లాట్ఫార్మ్ పై షెడ్ల నిర్మాణం జరగకపోవడం మూలంగా ప్రయాణికులు ఎండకి ఎండుతూ వానకు తడుస్తూ అవస్థలు పడుతున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చర్లపల్లి రైల్వే టర్మినల్ ను సందర్శించి క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నత్త నడకన జరుగుతున్న షెడ్ల నిర్మాణం తదితర సమస్యలపై చర్యల నిమిత్తం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి నాయకులు నేమూరి మహేష్ గౌడ్, డప్పు గిరిబాబు, జోనుల ప్రభాకర్ రెడ్డి, బొడిగ రాజు గౌడ్, జోన్ల వేణుగోపాల్ రెడ్డి, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి కడియాల బాబు, హరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసు అధికారులను ఘన సత్కారం




ప్రజా స్పూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలందించి ఈ సోమవారం పదవీ విరమణ పొందిన ఒక ఎస్సై,ఒక ఏఎస్సై , ఒక హెడ్ కానిస్టేబుల్ ను సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఘనంగా సత్కరించారు.41 సంవత్సరాలు పోలీసు శాఖలో పనిచేసి ప్రస్తుతం ఏడుళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన ఎస్సై మొహమ్మద్ షఫీ ని,36 సంవత్సరాలు తమ సేవలను అందించి భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందిన ఏఎస్సై సత్యనారాయణ ని ,అశ్వాపురం పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ సోమవారం పదవి విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ చిన్న వెంకటేశ్వర్లు , పదవీ విరమణ పొందడం జరిగింది. పదవీ విరమణ పొందిన ఈ ముగ్గురు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శాలువాల, పూలమాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం పోలీస్ శాఖలో వీరి అనుభవాలను జిల్లా ఎస్పీ తో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఎంతో కాలంగా పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందించిన అధికారుల అనుభవాలను నూతనంగా పోలీస్ శాఖలో భర్తీ అయిన అధికారులు సిబ్బంది స్పూర్తిగా తీసుకోవాలని అన్నారు. పోలీసు శాఖ నుండి పదవీ విరమణ పొందిన అధికారులు , సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. తమ దైనందిన కార్యక్రమాలలో వ్యాయామం, యోగా, ధ్యానం వంటి వాటిని అనుసరిస్తూ తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం పదవీ విరమణ పొందిన ముగ్గురు అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఏవో మంజ్యా నాయక్ , జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యాపారం చేస్తున్న నారాయణ విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలి

*** నిద్రమత్తులో విద్యాశాఖ అధికారులు**

*** పుస్తకాలు అమ్ముతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న పట్టించుకొని అధికారులు**

*** ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్**




మేడ్చల్, (ప్రజాస్ఫూర్తి) : విద్యాను వ్యాపారం చేస్తున్న నారాయణ విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో నారాయణ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని, పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న నారాయణ పాఠశాల పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బోడుప్పల్ లోని నారాయణ పాఠశాల ముందు ధర్నా చేపట్టడం జరిగింది.. ధర్నా చేస్తూ పుస్తకాలు అమ్ముతున్నారని డిఈఓ,ఎం ఈ ఓ కి సమాచారం ఇచ్చిన పట్టించుకోకుండా రాకుండా స్పందించలేదు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్ మాట్లాడుతూ విద్యాశాఖ నిబంధనలు పట్టించుకోకుండా అనుమతి లేకుండా పాఠశాల నిర్వహణ చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తు నారాయణ పాఠశాలలు రాష్ట్రవ్యాప్తంగా , మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో నారాయణ విద్యాసంస్థలలో ఎట్లాంటి ప్రభుత్వాల అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు బుక్కులు, పెన్నులు, షూ ,టై వంటి అక్రమంగా అమ్ముతూ లాభార్జన ధ్యేయంగా నడిపిస్తున్నారని అన్నారు. జీవో 1,10,92,42.. లను ఉల్లంఘించి జిల్లాలో ఇష్టానుసారంగా ఫీజులు పెంచి, పెంచిన ఫీజులను నోటీస్ బోర్డ్ లో పెట్టకుండా, స్మార్ట్ పేర్లను జోడిస్తూ , గ్రౌండ్, నిబంధనలకు అనుగుణంగా విశాలమైన తరగతి గదులు లేకుండా నడిపిస్తున్నారనీ అన్నారు. విద్యాశాఖ అధికారులు పట్టించుకోక పోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. జిల్లాలో నారాయణ పాఠశాలలు తమ ఇష్టానుసారంగా వ్యవస్థను నడుపుతున్నాయని. ఇది విద్యను వ్యాపారంగా మలచే దిశగా తీసుకెళుతోందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులపై తీవ్ర భారం మోపుతోంది. వెంటనే అధికారులు మొద్దు నిద్ర వదిలి విద్యా వ్యాపారం చేస్తున్న నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యా శాఖ అధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని అన్వర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్ జిల్లా నాయకులు అరవింద్, విద్యసాగర్, ఆదిత్య, సందీప్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు సబ్ జైలును సందర్శించిన జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి





ప్రజాస్ఫూర్తి ఇల్లందు: సోమవారం ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి ఇల్లందు సబ్ జైలును సందర్శించినారు. అనంతరం పలు రికార్డులు తనిఖీ చేసినారు. ఖైదీలకు మెనూ ప్రకారం సదుపాయాలు అందుతున్నాయో లేవో వారిని అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రత పాటించాలని ,ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఫ్రీ లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా న్యాయవాదిని నియమిస్తాము అని ఈ సందర్భంగా వారు తెలిపినారు. ఈ కార్యక్రమంలో జడ్జి గారితో పాటు సబ్ జైల్ సూపర్డెంట్ ఎన్. చంద్రశేఖర్, , సబ్ జైల్ సిబ్బంది కె. శ్రీనివాస్ సాంబ, శాంతి స్వరూప్, టి నవీన్, లీగల్ ఎయిడ్ న్యాయవాద ,కీర్తి కార్తీక్ , కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ ఎన్ రోల్ మెంట్ సెంటర్ ప్రారంభం

*** స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగం :పీసరి కృష్ణారెడ్డి**



ప్రజాస్ఫూర్తి,కుత్బుల్లాపూర్:బౌరంపేట్ వార్డ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ ఎన్ రోల్ మెంట్ సెంటర్ ను స్థానిక ప్రజలు వినియోగించుకోవాలని దుండిగల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి అన్నాడు.ఇన్నాళ్లు స్థానిక ప్రజలకు ఆధార్ సెంటర్ ఎక్కడ ఉందొ తెలియక ఇబ్బంది పడ్డారని ఇకనుండి బౌరంపేట్ వార్డ్ (పంచాయతీ) కార్యాలయం నందు ఆధార్ సెంటర్ అందరికి అందుబాటులో ఉండనుందని అన్నాడు. సోమవారం స్థానిక నాయకులతొ కలిసి నూతన ఆధార్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఆధార్ నమోదు చేసుకునేవారికి (పిల్లలకు),అడ్రస్ మార్పు,ఫోటో మార్పిడి,ఫింగర్ ప్రింట్ అప్డేట్ సేవలు ఈ కేంద్రం లో అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గోనె మల్లారెడ్డి, దమ్మగారి ప్రభాకర్ రెడ్డి, ఎంబరి ఆంజనేయులు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్ ప్లస్ మెడికల్ షాప్ ప్రారంభం




ప్రజా స్ఫూర్తి, కుత్బుల్లాపూర్: దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ ప్రధాన రహదారి లో గండిగూడెం. భాస్కర్ నూతనంగా ఏర్పాటు చేసిన మేడ్ ప్లస్ మెడికల్ షాప్ ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్.క్రిష్ణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతమైన ఔషధాలను ప్రజలకు అందించి వారి మన్నన్నలు పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రాఘవేందర్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు గండిగూడెం విజయ, ఉప్పరి బాలకృష్ణ, మరియు నాయకులు నీలం రెడ్డి, జి.రమేష్, జి.శ్రీకాంత్, జి.ఆంజనేయులు, జి.మల్లేష్, జి.రాము, జి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## విజయానికి మార్గం కష్టమైనదే, కానీ ఫలితం చరిత్రకెక్కేలా ఉంటుంది

*** జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : విజయానికి మార్గం కష్టమైనదే, కానీ ఫలితం చరిత్రకెక్కేలా ఉంటుందని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఇటీవల విపీజీ గ్రౌండ్‌లో జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కోటా కింద నిర్వహించిన క్రీడా పోటీలలో, టెన్నికాయిట్ విభాగంలో మొదటి స్థానం , క్యారమ్స్ విభాగంలో రెండవ స్థానం లో నిలిచిన వారికి సోమవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత రెడ్డి , జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ చేతుల మీదుగా బహుమతులను జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అందుకున్నారు.

# పాసి కుల సంఘం ఆధ్వర్యంలో వితంతువులకు చీరల పంపిణీ

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర పాసి కులా సంఘం ఆధ్వర్యంలో ఉదాదేవి పాసి జయంతి వేడుకలు కొత్తగూడెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాసి కుల సంఘ నాయకులు మాట్లాడుతూ ఉదాదేవి పాసి స్వాతంత్ర సమరయోధురాలు , అమె 1857 లో భారత తిరుగుబాటు బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనికి వ్యతిరేకంగా పోరాడిన యోధురాలు, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనికి వ్యతిరేకంగా భారత సైనికులు తరపున యుద్ధంలో పాల్గొన్నారు. అమె అవధ్ చివరి నవాబు వాజిద్ అలీషా మహిళా బెటాలియన్ లో సభ్యురాలు 1857 లో సికందర్ బాగ్ యుద్ధంలో పాల్గొంది. తన బెటాలియన్ కు సుచనలు చేసిన తర్వాత, అమె ఒక (పిప్పల్) రావి చెట్టుపైకి ఎక్కి ముందుకు సాగుతున్న బ్రిటిష్ సైనికులపై కాల్పులు జరపడంతో 36 మంది బ్రిటిష్ సైనికులకి అంతమందించిన తాను అమరులయ్యారు . అంతటి యోధురాలి



జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పాసి కుల సంఘం ఆధ్వర్యంలోని కేక్ కట్ చేసి పాసి కులా వితంతు మహిళలకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి బాల పాసి, రాష్ట్ర అధ్యక్షులు అభయదీప్ పాసి, కొత్తగూడెం టౌన్ అధ్యక్షులు హరి ప్రసాద్, మహిళా నాయకులు రమాదేవి పాసి, సోనీ పాసి, కుసుమ పాసి, యువజన నాయకులు వినాద్ పాసి, నర్సింగ్ పాసి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం లో ఘనంగా ఉదాదేవి పాసి జయంతి వేడుకలు

* **పాసి కుల సంఘం ఆధ్వర్యంలో వితంతువులకు చీరల పంపిణీ**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర పాసి కులా సంఘం ఆధ్వర్యంలో ఉదాదేవి పాసి జయంతి వేడుకలు కొత్తగూడెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాసి కుల సంఘ నాయకులు మాట్లాడుతూ ఉదాదేవి పాసి స్వాతంత్ర సమరయోధురాలు , అమె 1857 లో భారత తిరుగుబాటు బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనికి వ్యతిరేకంగా పోరాడిన యోధురాలు, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనికి వ్యతిరేకంగా భారత సైనికులు తరపున యుద్ధంలో పాల్గొన్నారు. అమె అవధ్ చివరి నవాబు వాజిద్ అలీషా మహిళా బెటాలియన్ లో సభ్యురాలు 1857 లో సికందర్ బాగ్ యుద్ధంలో పాల్గొంది. తన బెటాలియన్ కు సుచనలు చేసిన తర్వాత, అమె ఒక( పిప్పల్) రావి చెట్టుపైకి ఎక్కి ముందుకు సాగుతున్న బ్రిటిష్ సైనికులపై కాల్పులు జరపడంతో 36 మంది బ్రిటిష్ సైనికులకి అంతమందించిన తాను అమరులయ్యారు . అంతటి యోధురాలి జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పాసి కుల సంఘం ఆధ్వర్యంలోని కేక్ కట్ చేసి పాసి కులా వితంతు మహిళలకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి బాల పాసి, రాష్ట్ర అధ్యక్షులు అభయదీప్ పాసి, కొత్తగూడెం టౌన్ అధ్యక్షులు హరి ప్రసాద్, మహిళా నాయకులు రమాదేవి పాసి, సోనీ పాసి, కుసుమ పాసి, యువజన నాయకులు వినాద్ పాసి, నర్సింగ్ పాసి తదితరులు పాల్గొన్నారు.

## సార్క్‌కు పోటీగా చైనాపాక్ కొత్త కూటమి ఎత్తుగడ.. ఖండించిన బంగ్లాదేశ్



దక్షిణాసియాలో దశాబ్దాలుగా కీలక పాత్ర పోషించిన సార్క్ కూటమికి ప్రత్యామ్నాయంగా మరో కొత్త గ్రూప్‌ను ఏర్పాటు చేసేందుకు చైనా, పాకిస్థాన్‌లు తెరవెనుక ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నిర్వీర్యంగా ఉన్న సార్క్ స్థానంలో ఈ కొత్త వేదికను తీసుకురావాలన్నది వారి వ్యూహంగా కనిపిస్తోంది. ఈ మేరకు పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ పత్రిక 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' దౌత్యవేత్తలను ఉటంకిస్తూ ఒక కథనాన్ని ప్రచురించింది. పాకిస్థానీ మీడియా కథనం ప్రకారం, ఈ కొత్త కూటమి ఏర్పాటుపై చైనా, పాకిస్థాన్‌ల మధ్య ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిగాయి. ఇందులో భాగంగానే ఇటీవల చైనాలోని కున్మింగ్ నగరంలో చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ ప్రతినిధులు సమావేశమయ్యారు. సార్క్‌లోని మిగతా దేశాలైన శ్రీలంక, మాల్దీవులు, అఫ్ఘానిస్థాన్‌లను కూడా ఈ కొత్త కూటమిలోకి ఆహ్వానించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగినట్లు సమాచారం. వాణిజ్యం, దేశాల మధ్య అనుసంధానం పెంచుకోవడం ద్వారా ప్రాంతీయ సంబంధాలను బలోపేతం చేయాలన్నది ఈ కొత్త గ్రూపు ప్రధాన ఉద్దేశమని ఆ పత్రిక పేర్కొంది.

**కొట్టిపారేసిన బంగ్లాదేశ్**

బంగ్లాదేశ్ ప్రభుత్వం ఈ ప్రచారాన్ని ఖండించింది. చైనాలో జరిగింది రాజకీయ సమావేశం కాదని, ఎలాంటి కొత్త కూటమిని ఏర్పాటు చేయడం లేదని స్పష్టం చేసింది. బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సలహాదారు ఎం. తౌఫిద్ హోస్సైన్ మాట్లాడుతూ, "మేము ఏ కొత్త కూటమిని ఏర్పాటు చేయడం లేదు" అని తేల్చిచెప్పారు. దీంతో ఈ వ్యవహారంపై మరింత ఆసక్తి పెరిగింది. మరోవైపు, ఈ కొత్త గ్రూప్‌లోకి భారత్‌ను కూడా ఆహ్వానించే అవకాశాలు ఉన్నాయని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. భారత్, అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక సభ్యదేశాలుగా ఉన్న సార్క్ కూటమి గత కొన్నేళ్లుగా అచేతనంగా మారింది. 2016లో పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరగాల్సిన సార్క్ శిఖరాగ్ర సమావేశం యూరీలో ఉగ్రదాడి కారణంగా రద్దయింది. ఆ దాడి నేపథ్యంలో సదస్సులో పాల్గొనేందుకు భారత్ నిరాకరించింది.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

* **జేబీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ(జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ విద్యను ఒక వ్యాపారంగా మార్చేస్తూ నిభంధనలకు విరుద్ధంగా పాఠశాలలోనే యూనిఫామ్స్,బుక్స్ అమ్ముతున్నా,ప్రభుత్వ నిభందనలను పూర్తిగా కాలరాస్తు పేద,మధ్యతరగతి తల్లిదండ్రుల నుండి అక్రమంగా,విచ్చల విడిగా లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అదికారులు ప్రైవేట్ పాఠశాలల వారు ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని,అంతే కాకుండా నిభంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తున్న విద్యాశాఖ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ, యాంటి కరప్షన్ బ్యూరో ద్వారా



ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి ప్రైవేటు పాఠశాలలపై, వారికి సహకరిస్తున్న విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యారంగ సమస్యలపై జేబీపీ పార్టీ తరుపున త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## మొక్కల రాజశేఖర్ శ్రీకారం చుట్టిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఐదేళ్లు పూర్తి

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రకృతి ప్రేమికుడు, ప్రకృతి హరిత దీక్ష గ్రీన్ మోటార్ వెహికిల్ గార్డెన్ వ్యవస్థాపకులు, సింగరేణియన్ కె ఎన్ . రాజశేఖర్ (మొక్కల రాజశేఖర్) ప్రతిరోజు ఏదైనా ఒక మొక్కని నాటే కార్యక్రమం శ్రీకారం చుట్టి నేటితో (1826వ రోజు) 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం కొత్తగూడెం సెంట్రల్ వర్క్ షాప్ లో అల్లనేరేడు గింజలను సేకరించారు.. సేకరించిన ఈ గింజలను చెట్లు లేని ప్రదేశాలలో నాటు తున్నాను. ఎవరికైనా కావలసిన వారికి ఇస్తున్నాని ఆయన అన్నారు. 2017వ సంవత్సరంలో ప్లాస్టిక్ బొకేలు వద్దు.. పచ్చని మొక్కలే ముద్దు అనే నినాదానికి మొక్కలను బహుమతిగా ఇస్తూ ప్రచారం చేస్తూ నేను చేస్తున్న




వినూత్న ప్రకృతి సేవా కార్యక్రమాలకి నన్ను ఎంతగానో ప్రోత్స హించిన వంటి భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ, సింగరేణి సిఎండి బలరాం, సింగరేణి అధికారులకు, ఉద్యోగులకు, కలెక్టర్లకు, ప్రభుత్వ అధికారులకు, ఉద్యోగులకు,ప్రముఖులకు , నేను శ్రీకారం చుట్టిన ప్రకృతి హరిత దీక్ష ను తీసుకొన్న పెద్దవారికి చిన్నారులకు, రాజకీయ నాయకులకు,ప్రజలకు, స్వచ్ఛంద సంస్థలకు, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో ,ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు మిత్రులకు ధన్యవాదాలు తెలుపు తున్నాను.

## గల్ఫ్ ఆఫ్ ఒమన్ లో ఆయిల్ ట్యాంకర్ నౌకకు ప్రమాదం... 14 మంది భారతీయులను కాపాడిన నేవీ



గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో భారీ అగ్నిప్రమాదానికి గురైన ఒక ఆయిల్ ట్యాంకర్‌కు భారత నౌకాదళం అండగా నిలిచింది. ప్రమాదంలో చిక్కుకున్న 14 మంది భారతీయ సిబ్బందిని రక్షించేందుకు వేగంగా స్పందించి, సహాయక చర్యలు చేపట్టింది. విధి నిర్వహణలో ఉన్న ఐఎన్ఎస్ తబార్ నౌక, అత్యవసర సందేశం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని తన కర్తవ్యాన్ని నిర్వర్తించింది. వివరాల్లోకి వెళ్తే, పలావు దేశానికి చెందిన 'ఎంటీ యీ చెంగ్ 6' అనే ఆయిల్ ట్యాంకర్, భారత్‌లోని కాండ్లా పోర్టు నుంచి ఒమన్‌లోని షినాస్‌కు బయలుదేరింది. ఈ నౌక గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ప్రయాణిస్తుండగా నిన్న దాని ఇంజిన్ రూమ్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ అగ్నిప్రమాదం కారణంగా నౌకలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ట్యాంకర్ సముద్రంలో నిస్సహాయ స్థితిలో ఆగిపోయింది. ఆ సమయంలో ట్యాంకర్‌లో 14 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. ప్రమాదాన్ని గుర్తించిన వెంటనే ట్యాంకర్ సిబ్బంది అత్యవసర సహాయం కోసం సందేశాలు పంపారు. అదే సమయంలో గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో మిషన్‌లో ఉన్న భారత నౌకాదళానికి చెందిన స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తబార్‌కు ఈ సమాచారం అందింది. ప్రమాద తీవ్రతను గ్రహించిన ఐఎన్ఎస్ తబార్ సిబ్బంది ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ ట్యాంకర్ ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. ఈ ఘటనపై భారత నౌకాదళం అధికారికంగా స్పందించింది. "గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో విధుల్లో ఉన్న మా ఐఎన్ఎస్ తబార్ నౌక నిన్న ఎంటీ యీ చెంగ్ 6 నుంచి వచ్చిన అత్యవసర సందేశానికి స్పందించింది" అని నేవీ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. భారత్ నుంచి ఒమన్ వెళ్తున్న ఈ నౌకలో 14 మంది భారత సిబ్బంది ఉన్నారని, ఇంజిన్ రూమ్‌లో మంటలు చెలరేగడంతో ప్రమాదం జరిగిందని వివరించింది. ఐఎన్ఎస్ తబార్ నౌక సకాలంలో స్పందించి, ట్యాంకర్‌లోని సిబ్బందికి అవసరమైన సహాయాన్ని అందించిందని వెల్లడించింది.

## అభివృద్ధి పనులను చూసి జీర్ణించుకోలేక కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం



యాదాద్రి భువనగిరి, ప్రజా స్ఫూర్తి : భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి జీర్ణించుకోలేక ప్రతిపక్షా పార్టీలు కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబిసి కోఆర్డినేటర్ బెండ శ్రీకాంత్.. ప్రజా పాలనలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు ఇతర సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ జిల్లా స్థాయి అధికారులు సర్వే చేసి అర్హులైన వారికి ఇందిరమ్మ మంజూరు చేశారని అన్నారు.రాజకీయంగా ఎదురుకోలేకనే బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులను బధలం చేస్తున్నారని ఆరోపించారు. గడచిన పదేళ్లలో బిఆర్ఎస్ పార్టీ బోనగిరి ప్రజలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తి చేసి ఇవ్వలేదని గుర్తు చేశారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను పరిశీలించిన కార్పొరేటర్



పీర్జాదిగూడ, (ప్రజాస్ఫూర్తి) : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సాయి హిల్స్ కాలనీ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను సొమవారం 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం పనులను దగ్గరుండి కాలనీ వాసులతో కలసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం లో సాయి హిల్స్ కాలనీ అధ్యక్షులు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, కాలనీ పెద్దలు మహేందర్, సత్యనారాయణ, రాంలింగ రెడ్డి, భానుశేఖర్,రాజి రెడ్డి,శ్రవణ్, హరి, రాకేష్ రెడ్డి,రమేష్ రెడ్డి,మహేష్, రాములు, ప్రవీణ్, భాను, రంజిత్ మరియు మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్స్ లింగ స్వామి, నవీన్ రెడ్డి, కాంట్రాక్టర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు

## ఈ సి నగర్ రెసిడెట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాస్ఫూర్తి, కాప్రా: చర్లపల్లి డివిజన్ ఈసీ నగర్ రెసిడెట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ECNRWCA) నూతన కమిటీని ఆదివారం రాత్రి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఈసీ నగర్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు బి శ్రావణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన ఈసీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఈసీ నగర్ అభివృద్ధికి, ఈసీ నగర్ ప్రజల సంక్షేమకై కృషి చేయాలని కోరారు. గెలుపొందిన కమిటీ సభ్యులు అందరికీ శ్రావణ్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా సిహెచ్ వరప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఏ కృష్ణారెడ్డి, నవనీత, కార్యదర్శిగా మొగిలి మల్లేష్, సహాయ కార్యదర్శులుగా గుమ్మడి హరిప్రసాద్, ఎస్ శరత్ బాబు, కోశాధికారిగా పి బాల్ రెడ్డి ని ఎన్నుకున్నారు.

## భారతీయులకు ట్రంప్ భారీ ఊరట.. రెమిటెన్స్ పన్ను 1 శాతానికే తగ్గింపు

అమెరికాలో నివసిస్తున్న లక్షలాది మంది ప్రవాస భారతీయులకు ఊరట లభించింది. స్వదేశంలోని తమ కుటుంబాలకు పంపే నగదుపై (రెమిటెన్స్) విధించాలని ప్రతిపాదించిన పన్నును ప్రభుత్వం తగ్గించింది. తొలుత 5 శాతంగా ఉన్న ఈ పన్నును తాజాగా ఒక శాతానికే పరిమితం చేస్తూ ట్రంప్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కీలకమైన బిల్లు అమెరికా సెనెట్‌లో ఆమోదం పొందింది.

* **బ్యాంకు లావాదేవీలకు మినహాయింపు**

డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు'లో ఈ రెమిటెన్స్ పన్నును చేర్చారు. తాజా ముసాయిదా ప్రకారం, ఈ పన్నును ఒక శాతానికి తగ్గించారు. అయితే, బ్యాంక్ ఖాతాలు, డెబిట్ లేదా క్రెడిట్ కార్డుల ద్వారా చేసే నగదు బదిలీలకు ఈ పన్ను నుంచి పూర్తి మినహాయింపు కల్పించడం గమనార్హం.

# ఇంజినీరింగ్ ఫీజులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

* 2025-26 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్ ఫీజులు యథాతథం
* పాత ఫీజులనే కొనసాగిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు
* బీటెక్, ఎంటెక్ సహా అన్ని ఇంజినీరింగ్ కోర్సులకు వర్తించేలా నిర్ణయం
* ఫీజుల సమీక్షకు సమయం పట్టనుండటంతో ఈ చర్యలు
* ఎప్‌సెట్, ఈసెట్ విద్యార్థులకు భారీ ఊరట

తెలంగాణలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించాలనుకుంటున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తను అందించింది. 202526 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజినీరింగ్ ఫీజులను పెంచకూడదని నిర్ణయించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పాత ఫీజులనే ఈ ఏడాది కూడా కొనసాగించాలని సోమవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వేలాది మంది విద్యార్థులకు భారీ ఊరట లభించినట్లయింది. ఈ ఉత్తర్వులు బీటెక్, బీఈ, ఎంటెక్, ఎంఈ, బిఒకేషనల్ వంటి అన్ని రకాల ఇంజినీరింగ్ కోర్సులకు వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఇటీవల ఇంజినీరింగ్ కాలేజీలలో ఫీజులు భారీగా పెరిగే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్



రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీజుల ఖరారుకు ముందు సమగ్రంగా అధ్యయనం చేయాలని, ఇతర రాష్ట్రాల్లోని విధానాలను కూడా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నియమించిన కమిటీ నివేదిక రావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది.ఈ నేపథ్యంలో, ఫీజుల నిర్ణయం ఆలస్యమైతే ఎప్‌సెట్ ప్రవేశాల కౌన్సెలింగ్‌పై ప్రభావం పడుతుందని ఉన్నత విద్యామండలి అధికారులు భావించారు. కౌన్సెలింగ్ ప్రక్రియను సకాలంలో ప్రారంభించేందుకు, పాత ఫీజుల (గరిష్ఠంగా రూ.1.65 లక్షలు) ప్రకారమే అడ్మిషన్లు చేపట్టాలని యోచించారు. ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పాత ఫీజులనే కొనసాగిస్తూ తుది నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా, పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసి ఈసెట్ ద్వారా నేరుగా బీటెక్, బీఫార్మసీ రెండో సంవత్సరంలో ప్రవేశాలు పొందే విద్యార్థులకు కూడా ఈ నిర్ణయం వర్తిస్తుంది. వారికి కూడా పాత ఫీజులనే వర్తింపజేయనున్నారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో ఫీజులపై నెలకొన్న గందరగోళానికి తెరపడటంతో పాటు, కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు మార్గం సుగమమైంది.

## అమిత్ షా వ్యాఖ్యలకు సీపీఐ నారాయణ కౌంటర్

* నక్సలైట్లతో చర్చలుండవన్న అమిత్ షా వ్యాఖ్యలు
* అమిత్ షా వ్యాఖ్యలపై సీపీఐ నారాయణ తీవ్ర స్పందన
* నక్సలైట్లను చంపగలరేమో, నక్సలిజాన్ని అంతం చేయలేరన్న నారాయణ



నక్సలిజం నిర్మూలనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. నిజామాబాద్ పర్యటనలో షా చేసిన ప్రకటనపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఘాటుగా స్పందించారు. నక్సలైట్లను చంపగలరేమో కానీ, నక్సలిజాన్ని మాత్రం అంతం చేయలేరని ఆయన అన్నారు. ఈ మేరకు ఈరోజు ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని అమిత్ షా చెప్పడం హాస్యాస్పదంగా ఉందని నారాయణ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ విధానాలు మారనంత వరకు ఇలాంటి సమస్యలు పరిష్కారం కావని ఆయన అభిప్రాయపడ్డారు. నక్సలైట్లతో చర్చలు జరపబోమని చెప్పడం కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, నక్సలిజంపై కీలక వ్యాఖ్యలు చేశారు. నక్సలైట్లు తక్షణమే హింసను వీడి, ఆయుధాలు పక్కనపెట్టి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. వారు ఆయుధాలు వీడేంత వరకు వారితో ఎలాంటి చర్చలు ఉండవని తేల్చిచెప్పారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 10 వేల మంది నక్సలైట్లు లొంగిపోయారని ఆయన గుర్తుచేశారు. "గిరిజన బిడ్డలను, పోలీసులను నక్సలైట్లు చంపినప్పుడు వారి తరపున ఎవరూ మాట్లాడలేదు. కానీ ఇప్పుడు మాత్రం చర్చల కోసం చాలా మంది ముందుకొస్తున్నారు" అని కొందరి వైఖరిని దుయ్యబట్టారు. అమిత్ షా చేసిన ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే సీపీఐ నారాయణ పైవిధంగా స్పందించారు.

## పాశమైలారం ప్రమాద ఘటన.. సీఎస్ నేతృత్వంలో కమిటీ

* సంగారెడ్డి ఫ్యాక్టరీ ప్రమాదంపై సీఎం రేవంత్ తీవ్ర దిగ్భ్రాంతి
* సీఎస్ నేతృత్వంలో సహాయక చర్యల పర్యవేక్షణకు కమిటీ ఏర్పాటు
* క్షేత్రస్థాయిలో పరిస్థితిపై మంత్రులతో ఎప్పటికప్పుడు సమీక్ష
* మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని అధికారులకు ఆదేశం
* రేపు ఉదయం 10 గంటలకు ఘటనా స్థలానికి వెళ్లనున్న సీఎం



సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర ఘటనపై తక్షణమే స్పందించిన ఆయన, సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఈ కమిటీకి నేతృత్వం వహించనున్నారు. ఈ కమిటీలో సభ్యులుగా డీఆర్ఎఫ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కార్మిక శాఖ ప్రధాన కార్యదర్శిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సహాయక చర్యలను సమన్వయం చేయడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి పెను ప్రమాదాలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన శాశ్వత చర్యలపై ప్రభుత్వానికి ఈ కమిటీ సిఫార్సులు చేయనుంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న సహాయక కార్యక్రమాల పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రమాద తీవ్రత, తాజా పరిస్థితులపై మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్‌లతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని, ఏమాత్రం ఆలస్యం చేయవద్దని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఘటనా స్థలాన్ని సందర్శించనున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఆయన పాశమైలారంలోని ప్రమాద స్థలానికి చేరుకుని, అక్కడి పరిస్థితులను పరిశీలించి, బాధితులను పరామర్శించనున్నారు.

## పాశమైలారం ప్రమాదంపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన పేలుడు ఘటనపై తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పారిశ్రామికవాడలో రియాక్టర్ పేలడంతో పలువురు మృతి చెందడం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్‌కు ఫోన్ చేసి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ఆయన తన సంతాపాన్ని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు.పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర ఘటన తనను ఎంతగానో కలచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## రాజాసింగ్ రాజీనామా.. స్పందించిన మంత్రి పొన్నం

* బీజేపీ బీసీ వ్యతిరేకి అని మరోసారి రుజువైందన్న మంత్రి పొన్నం
* అధ్యక్ష పదవికి బీసీ నేతను అడ్డుకున్నారంటూ తీవ్ర ఆరోపణ
* రాజా సింగ్ రాజీనామాతో బీజేపీపై కాంగ్రెస్ విమర్శలు
* బీజేపీ ఒక ఫ్యూడల్ పార్టీ అని పొన్నం ఘాటు వ్యాఖ్యలు
* సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టీకరణ





బీజేపీ మరోసారి తన బీసీ వ్యతిరేక వైఖరిని స్పష్టంగా బయటపెట్టుకుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ రాజీనామా చేయడంపై ఆయన స్పందిస్తూ, ఆ పార్టీని ఒక ఫ్యూడల్ పార్టీగా అభివర్ణించారు. ఈ మేరకు సోమవారం ఆయన తన 'ఎక్స్' ఖాతా ద్వారా బీజేపీపై విమర్శలు చేశారు.

### * బీసీ నేతను అడ్డుకున్నారు: పొన్నం

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఒక బీసీ నాయకుడు నామినేషన్ వేయడానికి ప్రయత్నిస్తే, ఆయనను నిరంకుశంగా అడ్డుకున్నారని పొన్నం ఆరోపించారు. నామినేషన్‌కు మద్దతు తెలిపిన వారిని సైతం భయభ్రాంతులకు గురిచేయడం బీజేపీ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ఆయన అన్నారు. "ముగ్గురు బీసీ ఎంపీలు, ఎందరో సీనియర్ నాయకులు ఉన్నప్పటికీ, బీసీలకు అధ్యక్ష పదవి ఇవ్వడానికి బీజేపీకి మనసొప్పలేదు. గతంలో బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి, కనీసం శాసనసభాపక్ష నేతగా కూడా అవకాశం ఇవ్వలేదు" అని పొన్నం విమర్శించారు. బీజేపీలో బీసీలకు ఎప్పటికీ న్యాయం జరగదని, ఆ పార్టీ నేతలే ఈ విషయంపై వాపోతున్నారని, దీనికి బీజేపీ అధిష్టానం ఏం సమాధానం చెబుతుందని ఆయన ప్రశ్నించారు.

### * రాజా సింగ్ రాజీనామాతో రాజుకున్న వివాదం

సోమవారం జరిగిన బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎమ్మెల్యే రాజా సింగ్ తన మద్దతుదారులతో కలిసి నాంపల్లిలోని పార్టీ కార్యాలయానికి వెళ్లారు. అయితే, తన అనుచరులను బెదిరించారని, నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ ఆయన పార్టీకి తన రాజీనామాను ప్రకటించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఆ పార్టీలోని కొందరు పెద్దలకే ఇష్టం లేదని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

### * సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

సామాజిక న్యాయం అనేది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తమ పార్టీలో ముఖ్యమంత్రి రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తి అయితే, పీసీసీ అధ్యక్షుడిగా బీసీ నేతకు అవకాశం కల్పించామని గుర్తుచేశారు. "మేము కుల గణన చేపట్టి, బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చట్టం చేశాం. కానీ బీజేపీ మాత్రం బీసీల గొంతు కోస్తోంది" అని ఆయన విమర్శించారు. గతంలో బీసీ నేత బండి సంజయ్‌ను కీలకమైన ఎన్నికల సమయంలో అధ్యక్ష పదవి నుంచి తొలగించిన విషయాన్ని కూడా మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ బీసీల పక్షాన నిలుస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు న్యాయం చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీయేనని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## ఇస్కాన్ ఆధ్వర్యంలో అత్తాపూర్‌లో వైభవోపేతంగా శ్రీ జగన్నాథ రథయాత్ర

* శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి దివ్య రథాల ఊరేగింపు
* తరలివచ్చిన 10 వేల మంది భక్తులు
* హరినామ సంకీర్తన, భక్తి నృత్య ప్రదర్శనలు
* భక్తులకు మహా ప్రసాదం పంపిణి



హైదరాబాద్, జూన్ 29, (ప్రజా స్ఫూర్తి) : ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షియస్‌నెస్ (ఇస్కాన్) అత్తాపూర్ ఆధ్వర్యంలో, 4వ వార్షిక శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం 2025 జూన్ 29న హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక ఉత్సవంలో ఆలయ గర్భగుడిలోని శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి బయటకు వచ్చి, దివ్య రథాలపై ఊరేగింపుతో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ రథయాత్ర అత్తాపూర్‌లోని ఇస్కాన్ ఆలయం నుండి మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభమై, సాయంత్రం 6 గంటలకు అత్తాపూర్‌లోని పిల్లర్ నెంబర్ 173, సామ భూపాల రెడ్డి గార్డెన్స్ వద్ద ముగిసింది. తర్వాత, సామ భూపాల రెడ్డి గార్డెన్స్, అత్తాపూర్ నందు శ్రీ హరినామ కీర్తనలు, శ్రావ్యమైన భజనలు వంటి సాంస్కృతిక కార్య క్రమాలు ఉత్సాహభరితంగా నిర్వ హించారు. పౌరాణిక వైదిక పాత్రల తోలుబొమ్మలతో రామాయణ ఘట్టా లను ప్రదర్శించారు. భక్తులందరికీ చప్పన్ (56) భోగ నైవేద్య దర్శనం కల్పించారు. అలాగే, ఈ రథయాత్ర సందర్భంగా వేలాది భక్తులు పాల్గొని, అందమైన పూలతో అలంకరించిన స్వామివారి రథాన్ని భక్తి శ్రద్ధలతో లాగారు. శ్రీకృష్ణుని పవిత్ర నామాలను పారవశ్యంతో పాడుతూ, నృత్యం చేస్తూ భక్తులు ఆనంద పరవశులయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వేల కొలది భక్త జనం శ్రీ జగన్నాథుని దివ్య దర్శనం, ఆశీస్సులను పొందారు.

## మాదాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు.. అడ్డుకున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



హైదరాబాద్: నగర పరిధి మాదాపూర్‌లోని సున్నం చెరువులో హైడ్రా కూల్చివేతలను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అడ్డుకున్నారు. దీనిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సున్నం చెరువులో కూల్చివేతలను ఆపేయాలని డిమాండ్ చేశారు. సున్నం చెరువులో ఆక్రమణల తొలగింపును సోమవారం హైడ్రా (Hydra) చేపట్టింది. 32 ఎకరాల విస్తీర్ణంలోని సున్నం చెరువులో భారీగా ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన గుడిసెలను కూల్చేశారు. చెరువు సమీపంలో అక్రమంగా వేసిన బోరు మోటార్లను తొలగించారు. చెరువు పరిధిలోని భూగర్భ జలాలను వినియోగించొద్దని హైడ్రా సూచించింది. అక్రమంగా నీటిని తరలిస్తున్న పలు వాటర్ ట్యాంకర్లను సీజ్ చేసింది.

# ప్రధాని మోదీ విదేశీ పర్యటన.. 8 రోజులు, 5 దేశాల్లో పర్యటన!

* జులై 2 నుంచి 9 వరకు ప్రధాని మోదీ 8 రోజుల విదేశీ పర్యటన
* ఘనా, ట్రినిడాడ్, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాలను సందర్శించనున్న ప్రధాని
* బ్రెజిల్‌లో జరగనున్న 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్న మోదీ
* గ్లోబల్ సౌత్ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే ప్రధాన లక్ష్యం
* దశాబ్దాల తర్వాత ఘనా, ట్రినిడాడ్‌లో భారత ప్రధాని పర్యటించడం ఇదే ప్రథమం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. జులై 2వ తేదీ నుంచి ఎనిమిది రోజుల పాటు రెండు ఖండాల్లోని ఐదు దేశాల్లో ఆయన పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాలను సందర్శిస్తారు. బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడంతో పాటు, గ్లోబల్ సౌత్‌లోని కీలక దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్ఠం చేసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది

* **దశాబ్దాల తర్వాత కీలక దేశాల్లో పర్యటన**

విదేశాంగ శాఖ ఆర్థిక సంబంధాల కార్యదర్శి దమ్ము రవి తెలిపిన వివరాల ప్రకారం,



ప్రధాని మోదీ తన పర్యటనను జులై 2న ఆఫ్రికా దేశం ఘనాతో ప్రారంభిస్తారు. జులై 3 వరకు అక్కడే ఉంటారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని ఘనాలో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఘనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఆర్థికం, ఇంధనం, రక్షణ రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడంపై చర్చిస్తారు. అనంతరం జులై 3, 4 తేదీల్లో కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగోలో పర్యటిస్తారు. 1999 తర్వాత ఈ దేశంలో భారత ప్రధాని పర్యటించడం కూడా ఇదే ప్రథమం.

* **అర్జెంటీనాతో వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు**

అక్కడి నుంచి ప్రధాని నేరుగా దక్షిణ అమెరికాలోని అర్జెంటీనాకు వెళ్తారు. జులై 4, 5 తేదీల్లో ఆ దేశంలో పర్యటిస్తారు. అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలేతో మోదీ విస్తృతంగా చర్చిస్తారు. రక్షణ, వ్యవసాయం, మైనింగ్, చమురు, గ్యాస్, పునరుత్పాదక ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులు వంటి కీలక రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అంశాలపై ఇరువురు నేతలు దృష్టి సారిస్తారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

* **బ్రిక్స్ సదస్సులో కీలకోపన్యాసం**

అర్జెంటీనా పర్యటన ముగిశాక, ప్రధాని మోదీ జులై 5 నుంచి 8వ తేదీ వరకు బ్రెజిల్‌లో పర్యటిస్తారు. రియో డి జనీరో వేదికగా జరగనున్న 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ సదస్సులో ప్రపంచ పాలనా సంస్కరణలు, శాంతి భద్రతలు, కృత్రిమ మేధస్సు వినియోగం, వాతావరణ మార్పులు, ప్రపంచ ఆరోగ్యం, ఆర్థిక అంశాలపై ప్రధాని తన అభిప్రాయాలను పంచుకోనున్నారు. సదస్సు సందర్భంగా పలు దేశాధినేతలతో కూడా ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. చివరగా, జులై 9న నమీబియాకు చేరుకుని ఆ దేశంతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ప్రధాని నమీబియా పార్లమెంటులో ప్రసంగించే అవకాశం కూడా ఉందని సమాచారం.



# వంద కోట్ల రోడ్డు... నడిమధ్యలో చెట్లు... బీహార్‌లో అధికారుల నిర్వాకం!

* వింతగా రోడ్డు నిర్మాణం
* రూ.100 కోట్ల ప్రాజెక్టులో అధికారుల నిర్లక్ష్యం
* రోడ్డు మధ్యలోనే వదిలేసిన వృక్షాలు
* అటవీ శాఖ, జిల్లా యంత్రాంగం మధ్య వివాదం
* ప్రమాదాలతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

విశాలమైన, గుంతలు లేని కొత్త రోడ్డుపై ప్రయాణం ఎంతో హాయిగా ఉంటుంది. చుట్టూ పచ్చని చెట్లు ఉంటే ఆ అనుభూతే వేరు. కానీ, అవే చెట్లు రోడ్డుకు అడ్డంగా మధ్యలో ఉంటే పరిస్థితి ఎలా ఉంటుంది? ప్రతిక్షణం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని, అడ్డంకులను తప్పించుకుంటూ బండి నడపాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. సరిగ్గా ఇలాంటి వింత, ప్రమాదకరమైన పరిస్థితి బీహార్‌లోని జెహానాబాద్‌లో నెలకొంది. రాజధాని పట్నాకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో సుమారు రూ.100 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు విస్తరణ ప్రాజెక్టు.. అధికారుల నిర్వాకం కారణంగా ప్రయాణికుల పాలిట శాపంగా మారింది.

## ఏం జరిగిందంటే?

పట్నా-గయా ప్రధాన రహదారిపై జెహానాబాద్ పరిధిలో 7.48 కిలోమీటర్ల పొడవునా రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. అయితే, పనులు పూర్తయిన తర్వాత కూడా పాత చెట్లు రోడ్డు మధ్యలోనే నిటారుగా దర్శనమిస్తున్నాయి. ఈ చెట్లేమీ రాత్రికి రాత్రే మొలవలేదు. రోడ్డు విస్తరణ కోసం చెట్లను తొలగించేందుకు జిల్లా యంత్రాంగం అటవీ శాఖ అనుమతి కోరింది. అయితే, ఇందుకు ప్రతిగా 14 హెక్టార్ల అటవీ భూమిని తమకు కేటాయించాలని అటవీ శాఖ షరతు విధించింది. ఈ డిమాండ్‌ను జిల్లా యంత్రాంగం నెరవేర్చలేకపోయింది. దీంతో వారు ఒక విచిత్రమైన నిర్ణయం తీసుకున్నారు. చెట్లను తొలగించకుండా, వాటిని మధ్యలోనే వదిలేసి ఇరువైపులా రోడ్డు నిర్మించారు.

## ప్రాణాలతో చెలగాటం!

ఈ చెట్లు ఒకే సరళరేఖలో కూడా లేకపోవడంతో వాహనదారులు వాటిని తప్పించుకోవడానికి తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. డ్రైవింగ్ చేస్తూ ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చే చెట్లను తప్పించుకోవడానికి మెలికలు తిరుగుతూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది చూడటానికి రూ.100 కోట్లతో మృత్యువుకు ఆహ్వానం పలుకుతున్నట్లుగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న ఈ చెట్ల కారణంగా ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగాయని ఒకరు తెలిపారు. అయినప్పటికీ, ఈ చెట్లను తొలగించడానికి జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలుస్తోంది. ఒకవేళ ఈ మార్గంలో ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్నకు సమాధానం లేకుండా పోయింది. అధికారుల మధ్య సమన్వయ లోపం, నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథా అవడమే కాకుండా, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# బీహార్ ఎన్నికల్లో పొత్తులపై అసదుద్దీన్ ఒవైసీ కీలక వ్యాఖ్యలు

* మహాకూటమితో పొత్తుకు సిద్ధమన్న ఒవైసీ
* బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమని వ్యాఖ్య
* బీహార్ ఓటర్ల జాబితాపై తీవ్ర అభ్యంతరం

బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలతో కూడిన మహాకూటమితో పొత్తు కోసం చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. బీహార్ రాష్ట్ర ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమామ్ నేతృత్వంలో ఎన్నికల ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఒవైసీ తెలిపారు. బీజేపీ,



ఎన్డీఏలను కట్టడి చేసేందుకు మహాకూటమితో కలిసి పనిచేయాలని భావిస్తున్నామన్నారు. ముఖ్యంగా తమ పార్టీకి క్రియాశీల కార్యకర్తల బలం అధికంగా ఉన్న సీమాంచల్ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు వివరించారు. గతంలో కూడా ఎన్డీఏను నిలువరించడానికి తీవ్రంగా ప్రయత్నించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అయితే, పొత్తుల విషయంలో మహాకూటమి పార్టీలు ముందుకు రాని పక్షంలో తమ ప్రణాళిక భిన్నంగా ఉంటుందని ఒవైసీ తేల్చిచెప్పారు. పొత్తులు కుదరకపోతే, బీహార్‌లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మజ్లిస్ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమయంలో, బీహార్‌లో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరుతో చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిబంధనల వల్ల వేలాది మంది నిరుపేదలు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. ముఖ్యంగా సీమాంచల్ వంటి ప్రాంతాల్లో వరదల కారణంగా సర్వం కోల్పోయి అనేక కుటుంబాలు వలస వెళ్తుంటాయని అన్నారు. అలాంటి నిరుపేదలను ఓటరుగా నమోదు కావడానికి బర్త్ సర్టిఫికెట్, నివాస ధ్రువపత్రంతో పాటు తల్లిదండ్రుల నివాస పత్రాలు కూడా చూపాలని అడగడం సరికాదని ఆయన అన్నారు. ఈ కఠిన నిబంధనల వల్ల పేదలు తమ ఓటు హక్కుకు దూరమవుతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# 337 టన్నుల భోపాల్ వ్యర్థాలు దహనం : బూడిదను పాతిపెట్టేందుకు భూగర్భ గదుల నిర్మాణం!

* భోపాల్ గ్యాస్ దుర్ఘటన వ్యర్థాల దహనం పూర్తి
* 40 ఏళ్లుగా పేరుకుపోయిన 337 టన్నుల వ్యర్థాలు బూడిద
* పీథాంపుర్‌లోని డిస్పోజల్ ప్లాంట్‌లో ప్రక్రియ పూర్తి
* హైకోర్టు ఆదేశాలతో నిపుణుల పర్యవేక్షణలో దహనం
* మిగిలిన బూడిదను భూమిలో పాతిపెట్టేందుకు ఏర్పాట్లు
* డిసెంబర్ నాటికి ఈ ప్రక్రియ మొత్తం ముగిసే అవకాశం

దేశ చరిత్రలో పెను విషాదాన్ని మిగిల్చిన భోపాల్ గ్యాస్ దుర్ఘటనకు సంబంధించిన కీలక ప్రక్రియ ముగిసింది. యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలో దశాబ్దాలుగా పేరుకుపోయిన అత్యంత ప్రమాదకరమైన 337 టన్నుల రసాయన వ్యర్థాలను అధికారులు ఎట్టకేలకు పూర్తిగా దహనం చేశారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత ఈ వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్మూలించడంతో ఆ దుర్ఘటనకు సంబంధించిన ఒక అధ్యాయం ముగిసినట్టయింది. మధ్యప్రదేశ్



కాలుష్య నియంత్రణ మండలి అధికారి ద్వివేది ఈ వివరాలను వెల్లడించారు. పీథాంపుర్‌లోని ప్రత్యేక డిస్పోజల్ ప్లాంట్‌లో ఈ వ్యర్థాల దహన ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. మార్చి 27న హైకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డుల సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో ఈ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టారు. తొలుత ప్రయోగాత్మకంగా 30 టన్నుల వ్యర్థాలను కాల్చివేయగా, మిగిలిన 307 టన్నులను మే 5 నుంచి జూన్ 30 మధ్య విజయవంతంగా దహనం చేశారు. ఈ వ్యర్థాలను దహనం చేస్తున్న సమయంలో పర్యావరణంపై ఎలాంటి ప్రభావం పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని ద్వివేది స్పష్టం చేశారు. ప్లాంట్ నుంచి వెలువడే వాయువులను, కాలుష్య కణాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ యంత్రాంగం ద్వారా పర్యవేక్షించారు. పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి హాని కలగకుండా నిర్దేశిత పరిమాణంలోనే వ్యర్థాలను కాల్చివేసినట్లు ఆయన వివరించారు. దహన ప్రక్రియ పూర్తయ్యాక మిగిలిపోయిన బూడిద, ఇతర అవశేషాలను అత్యంత సురక్షితంగా ప్రత్యేక సంచుల్లో ప్యాక్ చేసి, లీకులు లేని కంటైనర్లలో ప్లాంట్‌లోని స్టోరేజ్ షెడ్‌కు తరలించారు. ఈ బూడిదను భూమిలో శాశ్వతంగా పాతిపెట్టేందుకు ప్రత్యేకంగా ల్యాండ్‌ఫిల్ సెల్స్ (భూగర్భ గదులు) నిర్మిస్తున్నామని, నవంబర్ నాటికి నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. ప్రణాళిక ప్రకారం అంతా సజావుగా సాగితే ఈ ఏడాది డిసెంబర్ నాటికి బూడిదను శుద్ధి చేసి ఈ సెల్స్‌లో పాతిపెట్టే ప్రక్రియ కూడా పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 1984 డిసెంబర్ 2వ తేదీ అర్ధరాత్రి భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ కర్మాగారం నుంచి మిథైల్ ఐసోసైనేట్ విషవాయువు లీకైన ఘటనలో అధికారిక లెక్కల ప్రకారం 3,787 మంది మరణించగా, 5 లక్షల మందికి పైగా తీవ్రంగా ప్రభావితమయ్యారు. ఆ దుర్ఘటన ప్రభావం తరతరాలపై పడిందని, బాధితులు నేటికీ ఆరోగ్య సమస్యలతో పోరాడుతూనే ఉన్నారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

# అంతరిక్షంలో భారత్ నిఘా నేత్రం: 52 మిలిటరీ ఉపగ్రహాల ప్రయోగం వేగవంతం

'ఆపరేషన్ సిందూర్' తర్వాత అంతరిక్షంలో నిఘాను భారత్ మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా చైనా, పాకిస్థాన్, హిందూ మహాసముద్రంపై నిఘా పెట్టేందుకు వీలుగా 52 మిలిటరీ ఉపగ్రహాలను ప్రయోగించాలని నిర్ణయించింది. రియల్ టైమ్ మానిటరింగ్ తదితర అవసరాల కోసం రూ.26,968 కోట్లను వెచ్చించనుంది. ఓ వైపు చైనా శరవేగంతో అంతరిక్షంలో ఆధిపత్యం కోసం యత్నిస్తున్న నేపథ్యంలో భారత్ ఈ చర్యలు చేపట్టింది. స్పేస్ బేస్ సర్వైలెన్స్ ఎస్‌బీఎస్ మూడోవిడత కార్యక్రమంలో భాగంగా.. ఇస్రో 21 ఉపగ్రహాలను ప్రయోగించనుంది. మిగిలిన 31 శాటిలైట్స్‌ను మూడు ప్రైవేటుసంస్థలు అభివృద్ధి చేసి కక్ష్యలోకి చేర్చనున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా తొలి ఉపగ్రహాన్ని ఏప్రిల్ 2026న కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. 2029 చివరికి మొత్తాన్ని అంతరిక్షంలోకి చేర్చనున్నారు. ఇస్రో స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ టెక్నాలజీని



ప్రైవేటు సంస్థలకు బదలాయించి.. వాటికి ఈ ప్రాజెక్టులో కీలక భాగస్వామ్యం ఇవ్వనుంది. అత్యవసర సమయాల్లో వేగంగా ఉపగ్రహాలను ప్రయోగించడానికి ఇది ఉపయోగపడనుంది. లోఎర్త్, జియో స్టేషనరీ కక్ష్యలపై దృష్టిపెట్టే ఈ ప్రాజెక్టును ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ పర్యవేక్షించనున్నారు. చైనా యాంటీ శాటిలైట్ సామర్థ్యానికి కౌంటర్‌గా కూడా ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. భారత్ భారీ స్థాయిలో ఉపగ్రహాలను కూడా ఆపరేషన్ సిందూర్ కోసం మోహరించింది. వీటిల్లో ఇస్రో వాడుతున్న ఉపగ్రహాలతో పాటు.. అంతర్జాతీయ మద్దతు కూడా తీసుకొంది. భారత్ వద్ద 911 మిలిటరీ ఉపగ్రహాలు ఉన్నాయి.

# లలిత్ మోదీకి సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ

ఐపీఎల్ వ్యవస్థాపకుడు, మాజీ ఛైర్మన్ లలిత్ మోదీకి సుప్రీంకోర్టులో భారీ షాక్ తగిలింది. ఫెమా (విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం) నిబంధనల ఉల్లంఘన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనకు విధించిన జరిమానాను బీసీసీఐ చెల్లించేలా ఆదేశించాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం సోమవారం తోసిపుచ్చింది. దీంతో ఆ జరిమానా భారం లలిత్ మోదీపైనే పడింది.

## అసలేం జరిగింది?

ఐపీఎల్ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో ఫెమా నిబంధనలను ఉల్లంఘించారన్న ఆరోపణలపై లలిత్ మోదీకి ఈడీ రూ.10.65 కోట్ల జరిమానా విధించింది. అయితే, ఈ మొత్తాన్ని బీసీసీఐ చెల్లించేలా ఆదేశించాలని కోరుతూ ఆయన గతేడాది డిసెంబర్‌లో మొదట బాంబే హైకోర్టును ఆశ్రయించారు. తాను ఐపీఎల్ పాలకమండలికి ఛైర్మన్‌గా అధికారిక హోదాలో ఉన్నప్పుడు ఈ వ్యవహారం జరిగిందని, బీసీసీఐ నిబంధనల ప్రకారం సంస్థ ప్రతినిధులు ఎదుర్కొనే చట్టపరమైన ఖర్చులను సంస్థే భరించాలని తన పిటిషన్‌లో పేర్కొన్నారు.ఆయన వాదనలను బాంబే హైకోర్టు అంగీకరించలేదు. పిటిషన్‌లో పసలేదంటూ కొట్టివేయడమే కాకుండా, లలిత్ మోదీకి అదనంగా రూ.లక్ష జరిమానా కూడా విధించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. బాంబే హైకోర్టు తీర్పును సమర్థించింది. బీసీసీఐ జరిమానా చెల్లించాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. అయితే, చట్ట ప్రకారం ఈ కేసులో తనను తాను రక్షించుకునేందుకు లలిత్ మోదీకి పూర్తి హక్కు ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఐపీఎల్‌కు సారథ్యం



వహించిన సమయంలో కోట్ల రూపాయల మేర ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారనే తీవ్ర ఆరోపణలతో లలిత్ మోదీ 2010లో దేశం విడిచి లండన్‌కు పారిపోయారు. అప్పటి నుంచి ఆయన అక్కడే తలదాచుకుంటుండగా, ఆయన్ను భారత్‌కు రప్పించేందుకు అధికారులు ప్రయత్నాలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. తాజా తీర్పుతో ఆయనకు న్యాయపరంగా మరో ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

# బిగ్ బ్రేకింగ్... బీజేపీకి రాజాసింగ్ రాజీనామా

* బీజేపీ సభ్యత్వానికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా
* రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల వేళ సంచలన నిర్ణయం
* తన అనుచరులను బెదిరించారని తీవ్ర ఆరోపణ



తెలంగాణ బీజేపీ పార్టీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేశారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతున్న సమయంలోనే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ నాయకత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన ఆయన, ఇకపై బీజేపీలో కొనసాగలేనని స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే, రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజాసింగ్ ఈ మధ్యాహ్నం తన మద్దతుదారులతో కలిసి నాంపల్లిలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ క్రమంలో తన అనుచరులను కొందరు నేతలు బెదిరించారని ఆయన ఆరోపించారు. ఈ పరిణామంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామా లేఖను కేంద్ర మంత్రి, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజాసింగ్ పార్టీ అధిష్ఠానంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం కేంద్రంలోని పెద్దలకు ఇష్టం లేదు. అందుకే ఇలాంటి పరిస్థితులు సృష్టిస్తున్నారు. అధ్యక్షుడిని ముందే నిర్ణయించుకుని, ఎన్నికల పేరుతో నాటకాలు ఆడుతున్నారు" అని ఆయన ఆరోపించారు. 2019 నుంచి పార్టీ కోసం ఎన్నో కష్టాలు పడ్డానని, పార్టీ కోసమే తాను ఉగ్రవాదులకు టార్గెట్ గా మారానని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, గత కొంతకాలంగా రాజాసింగ్ సొంత పార్టీ నేతల వైఖరిపై అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. పలు సందర్భాల్లో ఆయన నాయకత్వంపై పరోక్షంగా విమర్శలు చేశారు. తాజా పరిణామంతో తెలంగాణ బీజేపీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడినట్లయింది.

## వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు బెయిల్ మంజూరు



గుంటూరు: తెదేపా కార్యకర్త ఇసుకపల్లి రాజుపై దాడి కేసులో వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు గుంటూరు జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రస్తుతం సురేశ్ గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఇటీవల సురేశ్ తన స్వగ్రామం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో తెదేపా కార్యకర్త ఇసుకపల్లి కృష్ణ (రాజు)పై సోదరుడు నందిగం వెంకట్‌తో కలిసి విచక్షణారహితంగా దాడికి తెగబడిన సంగతి తెలిసిందే. తీవ్రంగా గాయపడ్డ రాజును అంతటితో వదిలేయకుండా ఇంటికి తీసుకెళ్లి బంధించారు. ఇంటి వద్ద సురేశ్ భార్య బేబి తదితరులు కూడా రాళ్లు, కర్రలతో కొట్టారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. సురేశ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించింది. తాజాగా ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

## వృత్తి నైపుణ్య శ్రీవారి సేవకుల కోసం ప్రత్యేక యాప్: తితిదే



తిరుమల: వృత్తి నైపుణ్య శ్రీవారి సేవకుల కోసం నెల రోజుల్లో ప్రత్యేక అప్లికేషన్‌ను రూపొందించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో సోమవారం వృత్తి నిపుణుల శ్రీవారి సేవపై జేఈవో వీరబ్రహ్మంతో కలిసి ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వృత్తి నిపుణులను శ్రీవారి సేవ ద్వారా తితిదేలో ముఖ్యమైన 10 విభాగాల్లో వారి సేవలను ఉపయోగించుకునేందుకు కార్యాచరణ రూపొందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు చెప్పారు. సాంకేతిక విభాగాల్లో కూడా సాంకేతిక నిపుణుల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించామని చెప్పారు. ప్రతి విభాగంలో అవసరాన్ని బట్టి శ్రీవారి సేవ ద్వారా వృత్తి నైపుణ్య సేవకుల సేవలను వినియోగించేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు వెంకయ్య చౌదరి తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వృత్తి నిపుణుల సేవలను వినియోగించుకుని భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ముందుగా ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టి, ఆ తర్వాత పూర్తిస్థాయిలో అమలు చేస్తామని వెల్లడించారు. త్వరలోనే దీనిపై విధివిధానాలు రూపొందించి సుస్థిర వ్యవస్థగా మార్చేందుకు కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## సార్వత్రిక సమ్మెకు వామపక్షాల మద్దతు



విజయవాడ: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెకు వామపక్ష పార్టీలు మద్దతు తెలుపుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ చెప్పారు. విజయవాడలోని దాసరి భవన్‌లో 10 వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ పరిశ్రమల కోసం ఉలవపాడు వద్ద చేపట్టిన బలవంతపు భూసేకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు చేపట్టిన నిరసనకు వామపక్ష పార్టీలు సంఘీభావం ప్రకటించాయన్నారు. జులై 2న ఆ గ్రామాల్లో పర్యటించి వారికి మద్దతుగా ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొంటామని చెప్పారు. ప్రజలపై భారం పడే అదానీతో సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను నిలిపివేయాలని వామపక్ష పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఇండోసోల్, గ్రీన్ కో కంపెనీలు జగన్ బినామీలని ఆరోపించారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక ఆ కంపెనీలకే భూములు కట్టబెట్టాలని చూడటం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు.

## మంగళగిరి ఎయిమ్స్ వద్ద ఎగ్జిట్ ర్యాంప్‌కు కేంద్రం ఆమోదం.. వెల్లడించిన కేంద్రమంత్రి పెమ్మసాని



మంగళగిరి: ప్రజల వైద్య అవసరాల రీత్యా మంగళగిరి ఎయిమ్స్‌కి చేరుకోవడానికి మంగళగిరి(ఎన్‌హెచ్ 16) వద్ద ఉన్న ఎంట్రీ ర్యాంప్‌ను ఎగ్జిట్ ర్యాంప్‌గా మార్చేందుకు కేంద్ర రహదారుల శాఖ ఆమోదం తెలిపినట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. దీని ఫలితంగా ఎయిమ్స్‌కు చేరుకోవాల్సిన దూరం. 4.66 కి.మీ నుంచి 1.26కి.మీకు తగ్గుతుందన్నారు. అత్యవసర వైద్యం, రోగుల రవాణా, వైద్య సిబ్బంది రాకపోకలకు కూడా ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. ఎన్‌హెచ్ 16పై మూడు కీలక ప్రదేశాల్లో మొత్తం 13 డైరెక్షనల్ బోర్డులను ఏర్పాటు చేయడానికి కూడా కేంద్రం అనుమతిచ్చిందని కేంద్రమంత్రి పెమ్మసాని తెలిపారు. రోగులు, సందర్శకుల ట్రాఫిక్ నియంత్రణకు ఇది ఎంతో తోడ్పడనున్నట్లు పేర్కొన్నారు. ఈ అభివృద్ధి చర్యలతో ప్రజలకు ప్రాధాన్యతనిచ్చే కేంద్ర ప్రభుత్వ నిబద్ధత మరోసారి స్పష్టమైందన్న పెమ్మసాని.. వేగవంతమైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఇది ఒక గొప్ప ముందడుగని అన్నారు. అనుమతులు మంజూరు చేసిన కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు.

## పల్నాడులో 'దొంగ' అరాచకం.. పోలీసులను కారుతో ఢీ కొట్టి..



అమరావతి: పల్నాడు జిల్లా అమరావతి మండలం మునుగోడులో వెంకట్రావు అనే ఓ దొంగ అరాచకం సృష్టించాడు. కానిస్టేబుళ్లను కారుతో ఢీ కొట్టాడు. పలు చోరీ కేసుల్లో అతడు నిందితుడిగా ఉన్నాడు. ఓ కేసు విచారణ కోసం పోలీసులు మునుగోడు వెళ్లగా.. పోలీసు లను చూసి కారులో పరారయ్యేందుకు వెంకట్రావు యత్నించాడు. అడ్డుకోబోయిన కానిస్టేబుళ్లను కారుతో ఢీ కొట్టాడు. దీంతో కానిస్టేబుల్ రత్న బాబుకు గాయాలయ్యాయి. మరొకరు త్రుటిలో తప్పించుకున్నారు. వెంకట్రావు పరారయ్యాడని, దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ అచ్చయ్య తెలిపారు.

## ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ మాధవ్.. ఖరారు చేసిన అధిష్ఠానం

* ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు
* రేపు విజయవాడలో అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ
* ఎన్నికల పరిశీలకుడిగా కర్ణాటక ఎంపీ మోహన్
* ఈ రోజు మధ్యాహ్నం 2 గంటల తర్వాత నామినేషన్



ఏపీ బీజేపీ అధ్యక్ష పదవిపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. పార్టీ రాష్ట్ర నూతన సారథిగా మాజీ ఎమ్మెల్సీ, ప్రస్తుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ పేరును పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. దీంతో రాష్ట్ర బీజేపీలో నాయకత్వ మార్పు ఖాయమైంది. అధ్యక్ష ఎన్నికల ప్రక్రియను మంగళవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అధికారికంగా నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు కర్ణాటకకు చెందిన ఎంపీ మోహన్‌ను ఎన్నికల పరిశీలకుడిగా నియమించారు. ఇందులో భాగంగా పీవీఎన్ మాధవ్ ఈ రోజు మధ్యాహ్నం 2 గంటల తర్వాత తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. పీవీఎన్ మాధవ్‌కు పార్టీలో, అనుబంధ సంస్థల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆయన శాసన మండలి సభ్యుడిగా (ఎమ్మెల్సీ) సేవలందించడమే కాకుండా, మండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. విద్యార్థి దశ నుంచే ఆర్‌ఎస్‌ఎస్‌లో చురుకుగా పనిచేసిన ఆయన, భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) లో కూడా పనిచేశారు.మాధవ్ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. ఆయన తండ్రి, దివంగత నేత చలపతిరావు బీజేపీలో సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. చలపతిరావు కూడా గతంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా పనిచేశారు. తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకుని, పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ పీవీఎన్ మాధవ్ ఇప్పుడు రాష్ట్ర అధ్యక్ష పదవిని చేపట్టబోతున్నారు.

## సిటీ బస్సు ఢీకొని ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి



కొత్తవలస: సిటీ బస్సు ఢీకొని ఇంజినీరింగ్ విద్యార్థిని మృతిచెందింది. ఈ ఘటన కొత్తవలస మండలం మంగళపాలెం వద్ద విశాఖఅరకు జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరంలోని కుమిలి గ్రామానికి చెందిన కర్రి నాగమణి (20) బీటెక్ ఫైనల్ ఇయర్ (సీఎస్‌ఈ) చదువుతోంది. ఆదివారం సాయంత్రం విశాఖ జిల్లా సింహాచలం వద్ద ప్రహ్లాదపురంలోని తన బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి సోమవారం ఉదయం తన బంధువులతో కలిసి సరదాగా గడిపేందుకు అరకు బయలుదేరారు. ఈ క్రమంలో మంగళపాలెం వద్దకు చేరుకోగానే కొత్తవలస నుంచి విశాఖ వెళ్తున్న సిటీ బస్సు అదుపుతప్పి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ వెనక కూర్చున్న నాగమణి కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఘటనా స్థలానికి చేరుకొన్న కొత్తవలస పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అక్రమ టోల్ గేట్ కేసు.. మళ్లీ పోలీస్ కస్టడీకి మాజీ మంత్రి కాకాణి

మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డిని పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నారు. అక్రమ టోల్ గేట్ నిర్వహణకు సంబంధించిన కేసులో ఆయన్ను విచారించేందుకు న్యాయస్థానం పోలీసులకు అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈరోజు, రేపు ఆయనను పోలీసులు విచారించనున్నారు.వివరాల్లోకి వెళితే... కాకాణి గోవర్ధన్ రెడ్డిపై నమోదైన అక్రమ టోల్ గేట్ కేసులో విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో మరింత లోతైన విచారణ జరిపేందుకు, ఆయన్ను తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, పోలీసుల అభ్యర్థనను అంగీకరిస్తూ కస్టడీకి అనుమతులు మంజూరు చేసింది. కోర్టు ఆదేశాల మేరకు ఈ రోజు, రేపు కాకాణిని నెల్లూరులోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో విచారించనున్నారు. ఇందుకోసం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ విచారణలో టోల్ గేట్ కేసుకు సంబంధించి కీలక సమాచారాన్ని రాబట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లింది: మంత్రి నారాయణ

* గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి నారాయణ తీవ్ర విమర్శలు
* మున్సిపల్ శాఖకు చెందిన రూ.3 వేల కోట్లు పక్కదారి పట్టించారని ఆరోపణ
* రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని వ్యాఖ్య
* నెల్లూరులో కాలువల పూడికతీత పనులను పరిశీలించిన మంత్రి



గత వైసీపీ ప్రభుత్వం మున్సిపల్ శాఖకు చెందిన సుమారు రూ.3 వేల కోట్ల నిధులను పక్కదారి పట్టించిందని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి, రూ.10 లక్షల కోట్ల అప్పులను ప్రజలపై మోపిందని ఆయన విమర్శించారు. సోమవారం నెల్లూరు నగరంలోని 45వ డివిజన్ పొగతోటలో కాలువ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు అనుభవంతో రాష్ట్రంలో పరిస్థితులు మళ్లీ గాడిన పడుతున్నాయని అన్నారు. "గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లింది. రూ.పది లక్షల కోట్ల అప్పు రాష్ట్రానికి మిగిల్చి వెళ్లింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు అనుభవంతో పరిస్థితులు గాడిన పడుతున్నాయి. వైసీపీ ఆపేసిన అభివృద్ధి పనులన్నీ తిరిగి ప్రారంభిస్తున్నాం" అని ఆయన తెలిపారు. నెల్లూరు నగరంలో 6.7 కిలోమీటర్ల మేర ఉన్న కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభించామని, రాబోయే 15 రోజుల్లో ఈ పనులను పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి రాజీ లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. అలాగే పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించేందుకు సిద్ధం చేసిన వీఆర్ హైస్కూల్‌లో సోమవారం నుంచే తరగతులు ప్రారంభిస్తున్నట్లు మంత్రి నారాయణ ప్రకటించారు. ఆగిపోయిన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, రాష్ట్రాన్ని తిరిగి ప్రగతి పథంలో నిలుపుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# గ్లామర్ ఫోజులతో మతిపోగొడుతున్న బేబమ్మ..



టాకీస్: ఉప్పెన సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీలో సంచలనం సృష్టించింది ఈ హీరోయిన్. అందం, అభినయంతో కుర్రాళ్ల మది దోచేసిన ఈ చిన్నది.. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకుంటూ తక్కువ సమయంలోనే బిజీగా మారిపోయింది. కానీ ఆమె నటించిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద అంతగా ఆకట్టుకోలేక పోయాయి. శ్యామ్ సింగ రాయ్, బంగా ్రరాజు చిత్రాలు మినహా.. మిగిలిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. దీంతో బేబమ్మకు ఆఫర్స్ తగ్గిపోయాయి. చివరగా శర్వానంద్ సరసన మనమే సినిమాలో కనిపించింది. ఈ మూవీ సైతం నిరాశ పరచడంతో ఇండస్ట్రీలో సైలెంట్ అయ్యింది ఈ వయ్యారి. ప్రస్తుతం తెలుగు సినిమాలకు దూరంగా ఉంటున్న ఈ వయ్యారి.. తమిళం, మలయాళం భాషలలోనే ఎక్కువగా నటిస్తుంది. ఇప్పుడు ఈ రెండు భాషలలో చేతినిండా సినిమాలతో బిజీగా ఉంటుంది. ఈ క్రమంలో సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటున్న ఈ వయ్యారి.. ప్రస్తుతం షేర్ చేసిన గ్లామరస్ ఫోటోస్ ఆకట్టుకుంటున్నాయి. ఇన్నాళ్లుగా పద్దతిగా కనిపించిన బేబమ్మ.. ఇప్పుడు గ్లామర్ లుక్స్ తో మతి పోగొడుతుంది. ప్రస్తుతం కృతి శెట్టి చేతిలో ఎల్ఐకే, జీనీ సినిమాలు ఉన్నాయి. ఈ రెండు చిత్రాలపైనే ఈ బ్యూటీ అంచనాలు పెట్టుకుంది. అలాగే ఇదివరకే మలయాళంలో మొదటి సినిమాతోనే మంచి మార్కులు కొట్టేసింది. ఇక పై పాత్ర ప్రాధాన్యతకు తగినట్లుగా గ్లామర్ విషయంలో ఎలాంటి హద్దులు లేకుండా ఉండేందుకు ఆసక్తి చూపిస్తుంది బేబమ్మ.కానీ ఇప్పటికీ ఈ అమ్మడు ఒక్క సినిమా సైతం ప్రకటించలేదు. తెలుగులో ఈ అమ్మడుకు అవకాశాలు అంతగా రావడం లేదు. ఎక్కువగా తమిళంలోనే నటిస్తుంది.

# అదిరిపోయేలా హరిహర వీరమల్లు ట్రైలర్



**టాకీస్:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తొలిసారి నటిస్తున్న పిరియాడిక్ యాక్షన్ డ్రామా 'హరి హర వీరమల్లు' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. తొలుత జూన్ 12న విడుదల కావాల్సిన ఈ చిత్రం, కొన్ని కారణాల వల్ల జూలై 24కు వాయిదా పడింది. అయితే ఈ లోపు అభిమానుల్లో ఉత్సాహం పెంచేందుకు జూలై 3న ట్రైలర్ని విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.అయితే ఈ ట్రైలర్పై నిర్మాత నాగవంశీ సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.మీరు ఏమి ఊహిస్తున్నారో నాకు తెలియదు? కానీ జూలై 3న రండి. మీకో పెద్ద సర్ప్రైజ్ ఉంది!హరిహర వీరమల్లు ట్రైలర్ అసాధారణంగా ఉంటుంది. మీరు గతంలో ఎప్పుడు పవన్ని చూడని విధంగా చూస్తారు. అంతేకాదు దానిని ఫీల్ అవుతూనే దానిని గురించి చర్చిస్తారంటూ హైప్ క్రియేట్ చేశారు. ఈ వ్యాఖ్యలతో ఫ్యాన్స్ లో ట్రైలర్పై అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పవన్ కళ్యాణ్ యాక్షన్, డైలాగ్ డెలివరీ, స్క్రీన్ ప్రెజెన్స్ ఎలా ఉంటుందో చూడాలని వారు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రం రెండు భాగాలుగా రూపొందుతోంది. పవన్ కళ్యాణ్ ఇందులో ఓ పోరాట యోధుడి పాత్రలో కనిపించనున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్గా నటిస్తుండగా, మ్యూజిక్ డైరెక్టర్ గా ఎం.ఎం. కీరవాణీ సంగీతాన్ని అందిస్తున్నారు. షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు దాదాపు పూర్తయిన ఈ సినిమా జూలై 24న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. పీరియాడిక్ బ్యాక్డ్రాప్, గ్రాండ్ యాక్షన్ ఎలిమెంట్స్తో తెరకెక్కుతున్న ఈ సినిమా, తెలుగు ప్రేక్షకులకే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించనుంది. మరోవైపు నిర్మాత నాగ వంశీ తాజాగా విజయ్ దేవరకొండ నటిస్తున్న 'కింగ్డమ్' సినిమా గురించి కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా పై సోషల్ మీడియాలో ట్రోల్స్ వస్తున్న విషయం తెలిసిందే. దీనిపై నాగ వంశీ స్పందిస్తూ.. 'కింగ్డమ్కు సంబంధించి ఏ పోస్ట్ చేసినా ట్రోల్స్ వస్తున్నాయనేది నిజం. సినిమా విడుదల య్యాక, వెండితెరపై అద్భుతం చూపించేందుకు మా టీమ్ ఎంతో కష్టపడుతోంది. ఈ మూవీ చూసిన తర్వాత మీరు ఫీల్ అయ్యే అనుభవం అసాధారణంగా ఉంటుంది అని తెలిపారు.

# సెంటిమెంట్తో పాటు ఎమోషన్స్

## తమ్ముడు చిత్రంపై దర్శకుడు శ్రీరామ్ వేణు



టాకీస్: సంక్రాంతికి వస్తున్నాం' బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ 'తమ్ముడు'. నితిన్ హీరోగా దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'తమ్ముడు' సినిమా జూలై 4న వరల్డ్ వైడ్ గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్ ను డైరెక్టర్ శ్రీరామ్ వేణు వివరించారు. 'తమ్ముడు' సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ తో పాటు డిఫరెంట్ లేయర్స్ ఉంటాయి. ట్రైలర్ లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం. సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దు అనుకున్నాం. ఒప్పుకుంటే యు బై ఎ సర్టిఫికెట్ ఇచ్చేవాళ్లు. సినిమాలోని ఎస్సెన్స్ ను సరిగ్గా ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలనే కట్స్ లేకుండా ఎ సర్టిఫికెట్ తీసుకున్నాం. ఇది మా అందరి ఉమ్మడి నిర్ణయం. దిల్ రాజు గారు ఒక్కరే ఈ డెసిషన్ తీసుకోలేదు. సినిమాలో అంతగా హింస లేదు. ఈ కథలో హీరోతో పాటు ఐదుగురు లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, స్వసిక విజయన్, దిత్య ముఖ్యమైన పాత్రలు చేశారు. హీరో అంటే ఇంత లెంగ్త్ ఉండాలి అనేది 'తమ్ముడు'లో ఉండదు. హీరోతో పాటు ఐదుగురు వుమెన్ క్యారెక్టర్స్ బలంగా ఉంటాయి. 'తమ్ముడు' కథ విని దిల్ రాజు గారు బ్జడెట్ గురించి ఆలోచించకుండా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు.

# రాజాసాబ్ను కిరణ్ అబ్బవరం కాపీ కొట్టాడా?



**టాకీస్:** టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కెరీర్లో వైవిధ్యమైన చిత్రాలు చేస్తూ ప్రేక్షకులని అలరిస్తున్నారు. హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా చిత్రాలు చేస్తున్నారు. ఇక ఇప్పుడు ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కె రాంప్.. ఈ చిత్రానికి జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. యుక్తి తర్జా కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాను హాస్య మూవీస్ మరియు రుద్రాంశ్ సెల్యులోయిడ్స్ బ్యానర్లపై రాజేష్ దండ మరియు శివ బొమ్మక్ నిర్మిస్తున్నారు.ఈ రోజు చిత్ర యూనిట్ ఫస్ట్ లుక్ పోస్టర్ను విడుదల

చేతులతో లుంగీ పట్టుకుని స్టైల్గా ముందుకు నడుస్తున్న విధానం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆయన

వెనుక భాగంలో ్గ÷ర్ ఎఫెక్ట్లతో తయారైన హార్ట్ షేప్ బాటిల్స్ డెకరేషన్ బాగుంది. ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్గా మారింది. అయితే కొన్ని వర్గాలు ఈ పోస్టర్ డిజైన్ను ప్రభాస్ నటించిన 'రాజాసాబ్' మూవీ పోస్టర్కు పోలికలు ఉన్నాయని అంటున్నారు. ఈ విషయం పై యూనిట్ ఇంకా స్పందించలేదు.ఇక ఈ సినిమాకు చేతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు.కిరణ్ అబ్బవరం ? చేతన్ భరద్వాజ్ కలయికలో ఇది మూడో చిత్రం. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'ఎస్ఆర్ కళ్యాణమండపం', 'వినరో భాగ్యము విష్ణు కథ' చిత్రాలు మంచి స్పందన పొందాయి. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి ప్రేక్షకులని అలరించేందుకు సిద్ధమయ్యారు. రాంప్ చిత్రం 2025లో దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. మాస్ కామెడీ, ఎమోషన్స్, యాక్షన్ అంశాలతో ఈ సినిమా మంచి హైప్ను సొంతం చేసుకుంటోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్లుక్ తో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. మరి కిరణ్ అబ్బవరం ఈసారి బాక్సాఫీస్ దగ్గర ఏ మేరకు మెప్పిస్తారో చూడాలి. ఇక ఇదిలా ఉంటే కిరణ్ అబ్బవరం సతీమణి రహస్య గోరఖ్ ఈ ఏ దాది మేలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. ఈ అద్భుతమైన క్షణాన్ని సోషల్ మీడియా వేదికగా ఫ్యాన్స్తో ఫొటోను షేర్ చేశాడు. కొడుకు వచ్చిన వేళా విశేషంతో మూవీతో పెద్ద సక్సెస్ అందుకుంటాడా అనేది చూడాలి.

# అల్లరి నరేశ్ ఆల్కహాల్ ఫస్ట్లుక్ విడుదల




**టాకీస్:** టాలీవుడ్లో మంచి టాలెంట్ ఉన్న ఆర్టిస్ట్లో అల్లరి నరేష్ కూడా ఒకరు. నటన పరంగా ప్రాణం పెట్టి ప్రేక్షకులకి మంచి వినోదం పంచేందుకు ఎంతో ప్రయత్నిస్తుంటారు. తన నటనతో ఎంత నవ్వించగలడో అంతే రీతిలో ఏడిపించగలడు ఈ అల్లరోడు. ఒకప్పుడు కామెడీ సినిమాలే చేసిన అల్లరి నరేష్ ఇప్పుడు జానర్ మార్చి సాలిడ్ కంటెంట్ ఉన్న సినిమాలు చేస్తున్నాడు. ఇప్పుడు అల్లరి నరేష్ తన 63వ సినిమాతో బిజీగా ఉండగా, ఈ మూవీకి సంబంధించి క్రేజీ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. అల్లరి నరేష్ తన కెరీర్లో సెకండ్ ఇన్నింగ్స్ను విభిన్న కథలతో విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నాడు. నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆయన మెహర్ తేజ్ దర్శకత్వంలో ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. ఇది అల్లరి నరేష్ కెరీర్లో 63వ చిత్రంగా రూపుదిద్దుకుంటోం ది. ఈ రోజు అల్లరి నరేష్ పుట్టినరోజు సందర్భంగా, సినిమా యూనిట్ టైటిల్ మరియు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేసింది. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే ఆసక్తికరమైన టైటిల్ను ఖరారు చేశారు. ఈ పోస్టర్లో నరేష్ ఆల్కహాలిజం లో మునిగి పోయినట్టుగా కనిపిస్తున్నారు. ఇది ఒక భ్రమ, వాస్తవికత మధ్య నడిచే కథ అని అర్థమవుతోంది. ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్తో కలిసి సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్పై సూర్యదేవర నాగవంశీ మరియు సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రుహాని శర్మ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తుండగా, గిబ్రాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. వివిధ భావోద్వేగాలతో నిండి ఉండే ఈ సినిమా, అల్లరి నరేష్కి మరో హిట్గా నిలవనుందని సినీ వర్గాలు ఆశిస్తున్నారు.ఇక ఈ రోజు అల్లరి నరేష్ బర్త్ డే కాగా, ఆయనకి సోషల్ మీడియాలో అభిమానుల నుండే కాక సినీ ప్రముఖుల నుండి కూడా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

# జూలై 11న మిరపకాయ్ రీ రిలీజ్

**టాకీస్:** మాస్ మహారాజ రవితేజ మళ్లీ తన అభిమానులకు ఫుల్ ఎంటర్టైన్మెంట్ మూవీని అందించేందుకు రెడీ అయ్యాడు. రవితేజ నటించిన 'మిరపకాయ్' మూవీ గురించి అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించగా, ఈ సినిమాలో రవితేజ యాక్టింగ్కు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఇప్పుడు ఈ సినిమాను రీ-రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతోంది. జులై 11న 'మిరపకాయ్' చిత్రాన్ని రీ-రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. హనుమాన్ మీడియా ఈ సినిమాను రీ రిలీజ్ చేస్తున్నారు, ఈ సినిమాలో అందాల భామ రిచా గంగోపాధ్యాయ్, దీక్షా సేత్ హీరోయిన్లుగా నటించగా, రమేష్ పుప్పల ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేశారు. థమన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందించారు. 'మిరపకాయ్' మూవీ రీ-రిలీజ్ కోసం అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. అయితే ఈ సినిమాలో హీరోయిన్స్తో పాటు ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నది మరో క్యారెక్టర్.. రిచా గంగోపాధ్యాయ్ ఫ్రెండ్ పాత్రలో కనిపించిన స్నిగ్ధ. నటనా శైలితో పాటు తన ప్రత్యేకమైన వాయిస్తో ప్రేక్షకులను ఆకట్టుకున్న స్నిగ్ధ, అప్పట్లో బాగా పాపులర్ అయ్యింది. తాజాగా 'మిరపకాయ్' రీ-రిస్ట ప్రకటన వెలువడిన నేపథ్యంలో, స్నిగ్ధ సోషల్ మీడియాలో హాట్ టాపిక్గా మారింది. 'మాస్ రాజా రవితేజ కుమ్మేసిన బ్లాక్బస్టర్ 'మిరపకాయ్' మళ్లీ థియేటర్లలోకి వస్తోంది. తప్పకుండా చూడండి!' అంటూ ఆమె ఓ పోస్ట్ కూడా చేసింది. అయితే ఆమె పూర్తిగా గుర్తుపట్టలేనంతగా మారిపోయింది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.